## ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్య..!

మైలవరం:మైలవరంలో విషాదం నెలకొంది.. ఇద్దరు పిల్లలను చంపి తాను ఆత్మహత్య చేసుకున్నాడు ఓ మంత్రి.. మృతులు హిరణ్య (9), లీలసాయి (7)గా గుర్తించారు..అయితే, రెండు నెలల కిందట పిల్లలను తన భర్త రవిశంకర్ వద్ద వదిలి వెళ్లిందట తల్లి చంద్రిక.. దీంతో, తీవ్ర మనస్తాపానికి గురై.. ఆత్మహత్య చేసుకుందామని భావించి ఉంటాడని.. తన పిల్లలను ఎవరు పోషిస్తారనే వారిని కూడా హత్య చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు..ఇక, ఆ ఇంట్లో ఓ సూసైడ్ లెటర్‌ను స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.. "నా చావుకు ఎవరు బాధ్యులు కాదని, జీవితంలో ఏమి సాధించలేదని.. అందుకే నా పిల్లలను చంపి నేను చనిపోతున్నానని" లేఖ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయాడు రవి శంకర్.. అయితే, గురువారం ఇంటికి వచ్చిన రవిశంకర్ తండ్రి తలుపులు తెరిచి చూడగా, మంచంపై విగత జీవులుగా కనిపించారు చిన్నారులు.. దీంతో, తన కుమారుడు ఏమయ్యాడు అనే ఆందోళన ఆయనలో మొదలుకావడంతో.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.. రవిశంకర్ ఫోన్ కాల్ సిగ్నల్ చివరగా ఇబ్రహీం పట్నం ఫెర్రీ దగ్గర కృష్ణా నది దగ్గర గుర్తించారు పోలీసులు.. దీంతో, నదిలో దూకి రవిశంకర్ ప్రాణాలు తీసుకుని ఉంటాడని భావిస్తున్నారు


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :96 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శనివారం 14-06-2025 | పేజీలు:4 వెల: 2.00


## విజయ్ రూపానీ మృతి... బీజేపీకి గుజరాత్ లో గట్టి దెబ్బ



అహ్మదాబాద్:ఆరెస్సెస్ నుంచి ఎదిగిన నాయకుడిగా నిబద్ధత నిజాయితీ కలిగిన నేతగా పాలనా దక్షునిగా పేరున్న వారు విజయ్ రూపానీ. ఆయన పార్టీకి కట్టుబడిన వారు. అందుకే సీఎం గా చేయమంటే గద్దెనెక్కారు. జనరంజకంగా పాలించారు. అయినా సరే కొన్ని రాజకీయ సమీకరణల వల్ల ఆయనని దిగిపోమంటే దిగిపోయారు. అలా ఆయన బీజేపీకి గట్టి విశ్వాసపాత్రునిగా ఉన్నారు.ఆయన గుజరాత్ మాజీ సీఎం గా ఉంటూ పార్టీని బలమైన వెన్నెముకగా ఉన్నారు అలాంటి ఆయన తాజాగా అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదంలో కన్నుమూశారు. దాంతో మరో రెండేళ్లలో గుజరాత్ లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఆయన లేని లోటు గట్టి దెబ్బ అని అంటున్నారు.ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. జనసంఘ్ కాలం నుంచి ఆయన పార్టీలో ఉన్నారు. అతను 1988 నుండి 1996 వరకు రాజ్‌కోట్ మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీకి చైర్మన్‌గా పనిచేశారు. అలాగే 1996 నుండి 1997 వరకు రాజ్‌కోట్ మేయర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఇక గుజరాత్ అసెంబ్లీకి 1998లో ఎన్నికయ్యారు. 2002, 2007, 2012, 2017, 2022లలో తిరిగి ఎన్నికవుతూ వస్తున్నారు. ఇక అనూహ్యంగా ఆయన 2016లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాడు. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది సమయం ఉంది అనగా 2021లో అతను ముఖ్యమంత్రి పదవి నుండి తప్పుకున్నారు.ఇక ఆయన మాజీ సీఎం అయినా సాధారణ జీవితాన్నే గడుపుతున్నారు. పార్టీ బాధ్యతలు చూస్తున్నారు. 2027లో గుజరాత్ ఎన్నికలు ఉన్నాయి. గత మూడున్నర దశాబ్దాలుగా గుజరాత్ బీజేపీ చేతులలో ఉంది. ఈసారి చూస్తే యాంటీ ఇంకెంబెన్సీ ఎక్కువగా ఉంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లను ఆప్ లాగేసుకోవడం వల్ల బీజేపీ లాభపడింది. ఈసారి ఆప్ పోటీ చేయదని అంటున్నారు. దాంతో కాంగ్రెస్ కి మంచి అవకాశాలు ఉన్నాయని అంటున్నారుమోడీ అమిత్ షా ఇద్దరూ గుజరాత్ కి చెందిన వారు. అక్కడ గెలుపు చాలా ముఖ్యం. అలాంటి తరుణంలో కీలక నేత సీఎం స్థాయి వ్యక్తి దుర్మరణం పాలు కావడం బీజేపీకి ఎంతో రాజకీయ నష్టం అని అంటున్నారు. దశాబ్దాలుగా పార్టీని సేవ చేస్తూ విలువలకు కట్టుబడి ఉన్న విజయ్ రూపానీ లాంటి నాయకులను తిరిగి తెచ్చుకోవడం ఆయన ప్లేస్ భర్తీ చేయడం కష్టమని అంటున్నారు.ఒక వైపు రాహుల్ గాంధీకి గుజరాత్ పర్యటనలలో జనాదరణ పెరుగుతోంది. అదే సమయంలో బీజేపీకి గుజరాత్ లో నాయకులు చాలా అవసరం పడుతున్నారు. ఇంతటి కీలక వేళ మాజీ సీఎం బీజేపీ వరిష్ట నేత విజయ్ రూపాని దుర్మరణం పాలు కావడం కమలనాథులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఆయన మరణవార్త తెలిసి రాజ్ కోట్ లోని ఆయన నివాసానికి పెద్ద ఎత్తున వస్తున్న ప్రజలను ఆదరణను చూస్తే విజయ్ రూపాని నాయకత్వం ఏమిటి అన్నది అర్థమవుతుంది అంటున్నారు.

## విమాన ప్రమాద ప్రాంతాన్ని సందర్శించిన మోడీ



అహ్మదాబాద్ : అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన సంగతి తెలిసిందే . ఈ ఘటన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం అహ్మదాబాద్ చేరుకున్నారు. విమానం కూలిన ప్రదేశానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బంది చనిపోయారు. వైద్య కళాశాల సముదాయంపై విమానం కూలిన నేపథ్యంలో మరో 24 మంది మృతి చెందారు.

మృత్యుంజయుడిని పరామర్శించిన ప్రధాని మోదీ

అహ్మదాబాద్: రాష్ట్రంలో ఘోర విషాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిరిండియా (ఎయిర్ ఇండియా) బోయింగ్ ఏ-171లో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది మరణించారు. అయితే, ఒకే ఒక్కరు రమేశ్ విశ్వాస్ కుమార్ బుచర్వాడ (విశ్వాష్ కుమార్ రమేష్) తృటిలో ప్రమాదం నుంచి బయటపడి మృత్యుంజయుడిగా నిలిచారు. ప్రస్తుతం అతను అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో నేడు రమేశ్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు.శుక్రవారం ఉదయం స్థలిని సందర్శించిన మోదీ.. అక్కడి నుంచి నేరుగా సివిల్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ రమేశ్‌ను కూడా మోదీ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అతడికి ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.




మృత్యుంజయుడు..

బ్రిటిష్ జాతీయుడైన (బ్రిటీష్ జాతీయుడు) 38 ఏండ్ల రమేశ్ విమానంలో 11ఏ సీటులో కూర్చున్నారు. ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్ వెనుక ఈ సీటు ఉంటుంది. తన కుటుంబాన్ని కలిసేందుకు భారత్‌కు వచ్చిన రమేశ్ తన సోదరుడు అజయ్ కుమార్ రమేశ్(45)తో కలసి లండన్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. విమానంలోని 11ఏ సీటులో కూర్చున్న రమేశ్ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక ప్రయాణికుడు. విమానం టేకాఫ్ అయిన 30 సెకండ్లకే భారీ శబ్దం వినిపించిందని, అంతలోనే విమానం కూలిపోయిందని తెలిపాడు. అంతా క్షణాల్లో జరిగిపోయింది అని రమేశ్ చెప్పుకొచ్చారు.ప్రమాదంలో రమేశ్‌కు ఛాతీ, కళ్లు,కాళ్లకు బలమైన దెబ్బలు తగిలాయి. అంతకుముందు, విమానం కూలిపోయి దగ్ధమవుతుండగా గాయపడిన రమేశ్ అంబులెన్సు వైపు నడుచుకుంటూ వస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విమానంలో ఇతర ప్రయాణికుల పరిస్థితి గురించి స్థానికులు రమేశ్‌ను అడగడం కనిపించింది. విమానం పేలిపోయింది అని గుజరాతీలో రమేశ్ చెప్పడం వినిపించింది.

11ఏ సీటు ప్రత్యేకతలు

ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ 787-8(డ్రీమ్‌లైనర్స్)లో 11ఏ సీటు ఎకానమీ క్లాస్ క్యాబిన్‌కు చెందిన మొదటి వరుసలో ఉంటుంది. బిజినెస్ క్లాస్‌కి వెనుక ఉంటుంది. క్యాబిన్‌కి అభిముఖంగా నిలబడి చూస్తే ఎడమ వైపున 11ఏ సీటు ఉంటుంది. విమానం రెక్కలు ఉండే ప్రదేశానికి రెండు వరుసల ముందు ఈ విండో సీటు ఉంటుంది. ప్రమాద సమయాలలో సురక్షిత సీటుగా పరిగణించబడుతుంది 11ఏ సీటు ఎమర్జెన్సీ డోర్‌కు వెనుకనే ఉంటుంది.

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేస్తుందని నాకు ముందే తెలుసు..

వాషింగ్టన్,పశ్చిమాసియాలో మళ్లీ తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులకు దిగింది.అయితే, ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ.. ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండకూడదు.. దీనిపై ఆ దేశం చర్చలకు రావాల్సిందే.. ఇక, ఇరాన్ ఏదైనా ప్రతీకార దాడులకు దిగితే దాన్ని ఎదుర్కొనేందుకు తమ సెంట్రల్ కమాండ్ రెడీగా ఉందన్నారు. అమెరికా తనను తాను రక్షించుకోవడంతో పాటు ఇజ్రాయెల్‌ను కూడా కాపాడేందుకు రెడీగా ఉందని డొనాల్డ్ ట్రంప్ తేల్చి చెప్పారు.అయితే, ఇరాన్ పై ఇజ్రాయెల్ దాడుల గురించి తమకు ముందు తెలుసు అని డొనాల్డ్ ట్రంప్ చేసిన పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. టెహ్రాన్ అణు సమస్యను దౌత్యపరమైన సంబంధాలతో పరిష్కరించడానికి మేం కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. ఈ అంశంపై చర్చలు జరిపేందుకు నా అధికారులను సిద్ధంగా ఉన్నారు. ఇదిలా ఉంటే, ఇజ్రాయెల్ పూర్తిగా




అప్రమత్తంగా ఉందని మిలిటరీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ఇయాల్ జమీర్ వెల్లడించారు. 10 వేల మంది సైనికులను సరిహద్దు దగ్గర సిద్ధంగా ఉంచామని తెలిపారు. తమపై దాడులు చేయడానికి ప్రయత్నించే వారు ఎవరైనా సరే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

## బాబు జగన్ ల మధ్య అసలు కథ అపుడేనా ?



అమరావతి,ఏపీలో 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. అలా ఇలా కాదు బిగ్ సౌండ్ తో వచ్చింది. కూటమి చేసిన మహా గర్జనకు విపక్షం అన్నదే లేకుండా పోయింది. ఎటు చూసినా కూటమే పరచుకుని ఉంది. తొలి ఏడాది పాలన కూటమిది ఎలా గడించింది అంటే నల్లేరు మీద నడక అని చెప్పాలి.ఎందుకంటే ఎదిరించే ప్రతిపక్షంలేదు. అసెంబ్లీ లోపలా బయటా వన్ మ్యాన్ షోగా సాగింది. ఇక జనంలో సైతం కూటమి మీద కోటి ఆశలు ఉన్నాయి. ఏ ప్రకటన చేసినా ఏ రకంగా ముందుకు సాగినా జనాలు కూడా వెయిట్ చేస్తూ వచ్చారు. కూటమికి వారు సైతం ఎంతో టైం ఇచ్చారు.ఆ విధంగా కూటమి పాలన ఫస్ట్ ఇయర్ సంతోషాలతో సంబరాలతో సాగింది. ఇక రెండవ ఏడాది జూన్ 13 నుంచి ప్రవేశిస్తోంది. ఇక్కడే అసలైన కథ ఉందని అంటున్నారు. గట్టిగా చెప్పాలంటే అతి పెద్ద పొలిటికల్ వార్ కి ఈ ఏడాదే బీజం పడే అవకాశం ఉందని అంటున్నారు. ఎందుకంటే మామూలుగా అధికార పార్టీకి తొలి ఆరు నెలల సమయం హనీ మూన్ పీరియడ్ గా ఉంటుంది.ఆ టైం నే విపక్షాలు కూడా ఇస్తాయి. కానీ ఏపీలో అయితే వైసీపీ ఏకంగా ఏడాది పాటు సమయం ఇచ్చింది. జగన్ ఎక్కడికీ పోలేదు పార్టీ తరపున చేసిన నిరసనలు కూడా అరకొరగానే ఉన్నాయి. ఇక అసెంబ్లీకి సైతం వైసీపీ పోలేదు. జగన్ ఈ ఏడాది కాలంలో పెట్టిన మీడియా సమావేశాలు కొన్ని తప్ప ఆయన వాయిస్ కూడా పెద్దగా వెళ్ళింది లేదు.దాంతో అంతా కూ టమి వాయిసే జనంలోకి పోయింది. కూటమి తరపున ముగ్గురు బలమైన నా యకులు చంద్రబాబు నారా లోకేష్, పవన్ కళ్యాణ్ జనంలో ఉంటూ పార్టీ తర ఫున పాజివిటీని పెంచడానికి కృషి చేశారు. అదే సమయంలో విపక్ష వైసీపీని ఎక్కడికక్కడ కట్టడి చేశారు. మొత్తం మీద చూస్తే సాఫీగా హ్యాపీగా తొలి ఏడాది గడచింది.ఇక మీదట ఇలా ఉండదని కూటమి పెద్దలకు కూడా తెలుసు. మరో వైపు చూస్తే జనంలో నెమ్మదిగా యాంటీ ఇంకెంబెన్సీ పెరుగుతోంది. ఇది కూడా కూటమి పార్టీలు గ్రహిస్తున్నాయి.అదే అదనుగా ఈ రెండో ఏడాది జన ంలోకి వెళ్ళడానికి వైసీపీ అధినేత జగన్ చూస్తున్నారు అని అంటున్నారు ఆ యన తన జిల్లా పర్యటనలను జూలై 8 వైఎస్సార్ జయంతి వేడుకల నుంచి మొదలెడతారు అని అంటున్నారు.జగన్ జనంలోకి వెళ్ళి కూటమి మీద విమర్శల బాణాలు ఎక్కుపెడతారు అని అంటున్నారు దాంతో కూటమి కూడా కౌంటర్ చేస్తుంది. దాంతో రాజకీయ వేడి అన్నది పెద్ద ఎత్తున రాజుకోవడం ఖాయమని అంటున్నారు. అంతే కాదు వామపక్షాలు కాంగ్రెస్ వంటి పార్టీలు సైతం ఈ ఏడాది నుంచి జనంలో ఎక్కువగా ఉండే ప్రయత్నం చేస్తాయని అంటున్నారు.ఇక తొలి ఏడాది ఉపేక్షించామని ఇక మీదట విపక్ష వైసీపీ విపరీత పోకడలను సహించేది లేదని చంద్రబాబు తన మొదటి ఏడాది పాలన పూర్తి సందర్భంగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో గట్టిగానే వార్నింగ్ ఇచ్చేశారు. ఎవరు తోక జాడిం చినా ఏమి చేయాలో బాగా తెలుసు అని ఆయన నర్మ గర్భ వ్యాఖ్యలు చేశారు. ఆషామాషీగా తీసుకోవడం అన్నది కుదరదని ఆయన ఖరాఖండీగా చెప్పేశారు. దాంతో ఏపీలో అసలైన రాజకీయ యుద్ధం ఇక మీదట మొదలు కాబోతోంది. అది ఏ రూపంలో ఉంటుంది. ఏ లెవెల్ కి చేరుతుంది. పీక్స్ కి వెళ్తే సీన్ ఎలా ఉంటుంది అన్నది రాజకీయ తెర మీద చూడాల్సిందే. సో అంతా వెయిటింగ్ మరి.

## కేంద్రం ఉగ్రవాదులతో కాల్పుల విరమణ చేసుకుంది..



సిద్దిపేట:సిద్దిపేట మాజీ ఎమ్మెల్యే ఎడ్ల గురువా రెడ్డి14 వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు..ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ..

కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులతో చర్చలు నడిపేందుకు సిద్ధంగా ఉంది.. కానీ నక్సలైట్స్ తో చర్చలకి ముందుకు రావడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టులను ఉగ్రవాదుల కంటే దారుణంగా మోడీ సర్కార్ చూస్తుందని విమర్శలు గుప్పించారు.ఇక, కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో ఇంజనీర్స్ దే పాత్ర ఉందని తమకు ఏం తెలియదని అనడం సరికాదు అని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేసీఆర్ సంపన్నమైన రాష్ట్రాన్ని కాళేశ్వరం కట్టి అప్పుల రాష్ట్రంగా మార్చారు అని ఆరోపించారు. అలాగే, ఎయిర్ ఇండియా ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలుపుతున్నాం.. ఈ ప్రమాద ఘటనపై కేంద్రం ఫెయిల్ అయింది.. మాజీ ముఖ్యమంత్రి ప్రమాదంలో మరణించడం దురదృష్టకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను తీర్చలేక కుంగిపోతోంది.. బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దు అని కూనంనేని సూచించారు.

## కేసీఆర్‌ను విచారణకు ఎందుకు పిలవకూడదు..

హైదరాబాద్, రాష్ట్ర ముఖ్యంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే కాళేశ్వరంపై విచారణ చేయిస్తామని మాట ఇచ్చారని, పీసీసీ చీఫ్‌గా ఉన్నపుడే రేవంత్ రెడ్డి కాళేశ్వర ప్రాజెక్టులో జరిగిన అవినీతిని బయట పెట్టారని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గజ్జల కాంతం అన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ ముఖ్యమ ంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆయన కుమారుడు కేటీఆర్ పై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గజ్జల కాంతం కామెంట్స్ చేశారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ జాతి పిత కాదని, కేసీఆర్‌ని విచారణకు ఎందుకు పిలవకూడదని ప్రశ్నించారు. నీతి మంతులు అయితే విచారణ ఎదుర్కోవాలన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఆయన ఇల్లు ముట్టడిస్తామని గజ్జల కాంతం అన్నారు.

అవినీతి జరిగిందని తెలిసే విచారణకు..

రాష్ట్ర ముఖ్యంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే కాళేశ్వరంపై విచారణ చేయిస్తామని మాట ఇచ్చారని, పీసీసీ చీఫ్‌గా ఉన్నపుడే రేవంత్ రెడ్డి కాళేశ్వర ప్రాజెక్టులో జరిగిన అవినీతిని బయట పెట్టారని అన్నారు. బీఆర్ఎస్ అవినీతి భరించలేకనే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. అధికారులు, చీఫ్ ఇంజనీర్లను విచారణ చేసిన తర్వాతే అవినీతి జరిగిందని కమిటీ నిర్ధారించి కేసీఆర్‌ను విచారణకు పిలిచిందన్నారు.




కాళేశ్వరం ప్రాజెక్ట్ మీ అబ్బా జాగీరా..

కాళేశ్వరం ప్రాజెక్ట్ మీ అబ్బా జాగీరా.. అని గజ్జల కాంతం ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్ట్ కాళేశ్వరమని.. ప్రాజెక్టులో అవినీతి జరిగిందని అధికారులు చెబుతున్నారని.. దీనిపై బీఆర్ఎస్ నాయకులు నీతి పరుల్లా మాట్లాడుతున్నారని విమర్శించారు. కేటీఆర్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకొని కేసీఆర్ ఫ్యామిలీ అవినీతి చేశారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ చుట్టూ పక్కల 30 వేల ఎకరాల భూములు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత బినామీల పేర్లపై ఉన్నాయని గజ్జల కాంతం ఆరోపించారు.

## భారతదేశ వ్యాప్తంగా బోయింగ్ 787-8 విమానాలు నిలిపివేత..?

అహ్మదాబాద్:అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంతో దేశవ్యాప్తంగా విషాదం నెలకొంది. లండన్ వెళ్తున్న బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమానం టేకాఫ్ అయిన 35 సెకన్లలోనే కుప్పకూలింది.పటిష్టమైన భద్రతా ప్రమాణాలకు పేరుగాంచిన డ్రీమ్ లైనర్ ఇలా కూలిపోవడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.ఇదిలా ఉంటే, ఈ ప్రమాదం తర్వాత దేశవ్యాప్తంగా బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమానాలను గ్రౌండింగ్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. బోయింగ్ సంస్థకు చెందిన ఈ విమానాల భద్రతా సమీక్ష కోసం అన్ని విమానాలను నిలిపేయవచ్చని సంబంధిత వర్గాలు శుక్రవారం తెలిపాయి. అయితే, ప్రమాదంపై దర్యాప్తు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇదే కాకుండా, ఎయిర్ ఇండియా విమాన నిర్వహణపై దాని స్టాండర్డ్ ఆపరేటింగ్ విధానంపై కూడా పరిశీలన ఎదుర్కోవాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు చెప్పారు.గురువారం, లండన్‌కు వెళ్లే ఎయిర్ ఇండియా విమానం బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి బయలుదేరిన కొన్ని సెకన్ల తర్వాత




కూలిపోయింది. విమానంలో ఉన్న 242 మంది ప్రయాణికులు మరియు సిబ్బందిలో ఒకరు మాత్రమే ప్రమాదం నుండి బయటపడ్డారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో విమానం టేకాఫ్ అయిన వెంటనే ఎత్తును కోల్పోయిందని అధికారులు తెలిపారు. మేఘనినగర్ ప్రాంతంలోని బిజె మెడికల్ కాలేజీ డాక్టర్స్ హాస్టల్స్ పై కూలిపోయింది.

## సంపాదకీయం

శనివారం 14-06-2025

# ద్వీప దేశాలతో ఆత్మీయ బంధం

కయ్యాలమారి పాకిస్థాన్ మొదటి నుంచీ భారతదేశంతో సత్సంబంధాలు నెరపడానికి ససేమిరా అంటోంది. ఇటీవలి కాలం వరకు స్నేహంగా ఉంటూవచ్చిన బంగ్లాదేశ్ కూడా ఇప్పుడు పాక్‌తో కలిసి నడుస్తోంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పాక్, బంగ్లాలను తత్తరపాటుకు గురిచేసింది. కయ్యాలమారి పాకిస్థాన్ మొదటి నుంచీ భారతదేశంతో సత్సంబంధాలు నెరపడానికి ససేమిరా అంటోంది. ఇటీవలి కాలం వరకు స్నేహంగా ఉంటూవచ్చిన బంగ్లాదేశ్ కూడా ఇప్పుడు పాక్‌తో కలిసి నడుస్తోంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పాక్, బంగ్లాలను తత్తరపాటుకు గురిచేసింది. వాటితో స్నేహం కోసం వెంపర్లాడేకన్నా, ఇతర సమీప దేశాలతో బంధం బలపరచుకోవడమే ఉత్తమమని దిల్లీ భావిస్తోంది. హిందూ మహాసముద్రంలోని ద్వీప దేశాలతో సుహృద్భావాన్ని పెంపొందించుకోవడానికి భారత్ 'ఇరుగుపొరుగులకు ప్రాధాన్యం' విధానాన్ని చేపట్టింది. తీవ్రమైన ఉప్పు కొరతను ఎదుర్కొంటున్న శ్రీలంకకు హుటాహుటిన ఉప్పు పంపడం, మాల్దీవులకు అయిదు కోట్ల డాలర్ల సాయం అందించడం ద్వారా దిల్లీ ఈ విధానాన్ని అమలులో పెట్టింది. శ్రీలంకలో ఇటీవల కుండపోత వర్షాలకు ఉప్పు మడులు కొట్టుకుపోయాయి. దేశానికి 60శాతం ఉప్పును అందించే పుట్టాలంలో అకాల వర్షాలకు 15వేల టన్నుల ఉప్పు కరిగి నీరైపోయింది. ఫలితంగా శ్రీలంకలో ఉప్పు ధరలు చుక్కలను తాకాయి. కొన్నిచోట్ల కిలో ఉప్పును 400 లంక రూపాయలకు అమ్మారంటే అక్కడి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

లంకకు బాసటగా...

శ్రీలంకలో రెండు సీజన్లలో ఉప్పు పంట వస్తుంది. ఫిబ్రవరి–ఏప్రిల్ మధ్య యాలా సీజనులో, జూన్–అక్టోబరు మహా సీజనులో ఉప్పు తయారవుతుంది. ఈ ఏడాది యాలా సీజనులో 35వేల టన్నుల ఉప్పు చేతికి అందాల్సింది. మార్చి మొదటి రెండు వారాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల చివరకు ఎనిమిది వేల టన్నులే చేతికి వచ్చింది. ఉప్పు లేక కటకటలాడుతున్న శ్రీలంకను ఆదుకోవడానికి భారత్ శరవేగంగా 3,050 టన్నులు పంపింది. శ్రీలంక 2022లో తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి జారిపోయినప్పుడు కూడా భారత్ యుద్ధ ప్రాతిపదికన మందులు, ఎరువులు, ఇంధనం పంపి 'ఇరుగుపొరుగులకు ప్రాధాన్యం' విధానాన్ని సార్థకం చేసింది. భారత్‌కు ఉపఖండంలో పాక్, బంగ్లాలతో సమస్యలు ఉన్నాయి. మయన్మార్ సమస్యలు మయన్మార్‌వి. ఇక మిగిలింది శ్రీలంకే. ఆ దేశంతో భారత్‌కు ఆర్థికంగా ఇతరత్రా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. భారత్ అందించిన సాయంతో సంక్షోభం నుంచి బయటపడిన శ్రీలంక ఇప్పుడు ఒక మోస్తరు వృద్ధిరేటు సాధిస్తోందని అంతర్జాతీయ ఆర్థిక సంబంధాలపై భారత పరిశోధనా మండలి(ఇక్రియర్)కి చెందిన నిషా తనేజా విశ్లేషించారు. రెండు దేశాల వాణిజ్య, పారిశ్రామిక మండళ్లు మరింత సమన్వయంగా పనిచేయాలని ఆమె సూచించారు. భారత్, శ్రీలంక, మాల్దీవులను అనుసంధానిస్తున్న 'మహాసాగర్' పథకం ఆర్థిక బంధాన్ని బలోపేతం చేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హిందూ మహాసముద్రంలోని మరో ద్వీప దేశం మాల్దీవులు తనకు చెల్లించాల్సిన అయిదు కోట్ల డాలర్ల రుణ కిస్తీకి గడువును ఇండియా ఇటీవల ఏడాదిపాటు పొడిగించింది. 2019లో నాటి మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలీ సర్కారుకు భారత్ 20కోట్ల డాలర్ల బడ్జెట్ సహాయ ప్యాకేజీని ప్రకటించింది. అందులో అయిదు కోట్ల డాలర్లను గ్రాంటుగా, 15కోట్ల డాలర్లను ట్రెజరీ బిల్స్(టీబిల్స్) రూపంలో రుణంగా ఇచ్చింది. టీబిల్స్‌ను తడవకు అయిదు కోట్ల డాలర్ల చొప్పున మూడు దఫాలుగా మంజూరు చేసింది. నిరుడు జనవరిలో ఒక కిస్తీ టీబిల్స్‌ను పూర్తిగా చెల్లించేశామని మాల్దీవుల విదేశాంగ మంత్రి అబ్దుల్ ఖలీల్ వెల్లడించారు. 2023 మే నెలలో చెల్లించాల్సిన రెండో కిస్తీని ఏడాదిపాటు వాయిదా వేశారు. ఇప్పుడు దాన్ని మళ్లీ ఏడాదిపాటు వడ్డీ లేకుండా పొడిగించారు. మాల్దీవుల ప్రభుత్వ విజ్ఞప్తిపై ఎస్‌బీఐ కిస్తీ వాయిదాకు అంగీకరించిందని భారత హైకమిషన్ తెలిపింది.

దౌత్య సహకార వృద్ధి...


మాల్దీవుల విదేశాంగ మంత్రి ఖలీల్ తమ ప్రతినిధి వర్గంతో దిల్లీ వచ్చి సమగ్ర ఆర్థిక, సాగర భద్రతా భాగస్వామ్య ఒప్పంద అమలును సమీక్షించారు. ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ఖలీల్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి మాల్దీవుల ప్రభుత్వం, ప్రజలు మద్దతు ఇస్తున్నట్లు ఆయన ప్రకటించారు. భారత్ సకాలంలో అత్యవసరంగా అందించిన ఆర్థిక సాయం మాల్దీవుల ప్రజలకు ఎంతో ఉపయోగకారిగా ఉందని వివరించారు. ఖలీల్ భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌తోనూ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మాల్దీవుల అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని మంత్రి హామీ ఇచ్చారు. మొత్తంమీద పాక్, బంగ్లాలతో సంబంధాలు సజావుగా లేకపోయినా ఇతర పొరుగు దేశాలకు ఆర్థిక తోడ్పాటు అందిస్తూ దౌత్యపరంగా వాటి సహకారాన్ని చూరగొనడంలో భారత్ సఫలమవుతోంది.

# యూపిఐ పేమెంట్లపై పన్ను బాదుడు




న్యూఢిల్లీ, మోడీ గత పదేళ్ల ప్రభుత్వానికి, ఎన్‌డిఎ పక్షాలతో మద్దతుతో నడుస్తున్న ఏడాది పాలనకు పెద్దగా తేడా కనిపించడం లేదు. తనదోవన తాను నడుస్తున్నారు. దేశంలో అనేకానేక సమస్యలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదు. జూన్ 9 నాటికి ఎన్‌డిఎ ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుంది. మద్దతు ఇస్తున్న ప్రధాన పార్టీల్లో టిడిపి,జెడియూ లు తమ స్వలాభం కోసం పనిచేసు కుంటున్నారు. నితీశ్ కేవలం బీహార్ వ్యవహారాలకే పరిమితం అయ్యారు. వచ్చే ఎన్నికల్లో గులవడం కోసం కేంద్రం నుంచి పనులు చేయించుకునే పనిలో పడ్డారు. అలాగే చంద్రబాబు కూడా ఎపిని పునరుద్దరించుకునే పనిలో అనేకానేక పథకాలు, నిధుల విడుదల కోసం పనిచేసుకుంటున్నారు. పోలవరం, అమరావతి, బనకచర్ల వంటి ప్రాజెక్టులను పట్టాలకెక్కించుకునే పనిలో ఉన్నారు. ఈ ఇద్దరికీ ఉమ్మడిగా దేశం గురించి ఆలోచించి మోడీని డైరెక్ట్ చేసేంతగా దృష్టి పెట్టడం లేదు. యూపిఎ పేమెంట్లపై ట్యాక్స్ విధించాలన్న దుమారం చెలరేగింది. దీనిని కేంద్రం ఖండించినా ఎక్కడో నిప్పులేనిదే పొగరాదు. దీనిపై తాత్కాలికంగా నిర్ణయం వాయిదా వేసి ఉంటారు. ఇలాంటి వాటిపైనా డబ్బులు గుంజాలనే ఆలోచనలో మోడీ ఉన్నారు. ఇప్పటివరకు యూపీఐ మీద ఎలాంటి ఛార్జీలను విధించడం లేదు. అయితే త్వరలోనే ఈ లావాదేవీలపై కూడా ఛార్జ్‌లను వసూలు చేయాలని కేంద్రం భావిస్తున్నట్టు– వార్తలు వచ్చాయి. ఆ వార్తలను తాజాగా ఆర్థిక శాఖ ఖండించింది. డిజిటల్ లావాదేవీలను నిర్వహించడం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో వీరికి సహకరించేందుకు మర్చంట్ డిస్కౌంట్ రేట్‌లను వసూలు చేయాలని కేంద్రం ఆలోచిస్తోందని వార్తలు వచ్చాయి. అయితే ఆ వార్తలు కేవలం ఊహాజనితాలని, ఛార్జీలు వసూలు చేసే ఆలోచన లేదని ఆర్థిక శాఖ తెలిపింది. యూపీఐ ద్వారా 3000 రూపాయల పైచిలుకు చెల్లింపులు జరిగితే ఎండీఆర్ ఛార్జీలను వసూలు చేస్తారని జాతీయ మీడియా పేర్కొంది. నిజానికి 2020 నుంచి జీరో ఎండీఆర్ పాలసీ అమల్లో ఉంది. ఇలాంటి వాటిపై ప్రజ్లో ఆందోళన వస్తున్నా టిడిపి లాంటి పార్టీ కూడా పట్టించుకోవడం లేదు. ఎన్‌డిఎకు మద్దతగా ఉన్నామన్న విషయం మరచిపోయారేమో. తెలుగుదేశం, జనతాదళ్ యునైటెడ్ పొత్తుతో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మోడీ ఇలాంటి నిర్ణయాలపై భాగస్వామ్య పక్షాలతో చర్చించడం లేదు. చంద్రబాబు, నితీశ్ కుమార్‌లు కూడా వీటిని అడగడం లేదు. తెలుగుదేశం, జెడి(యు) పార్టీలకు ఎన్‌డిఎ ప్రభుత్వంలో అత్యున్నత భాగస్వామ్యం పొందే అవకాశం లభించింది. ఈ అవకాశం అన్నిప్రాంతీయ పార్టీలకు లభించలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు తలెత్తడంతో ప్రస్తుతం బిజూ జనతాదళ్, బహుజన సమాజ్, జననాయక్ జనతా,టిఆర్ఎస్, అన్నాడిఎంకె ఈ ఐదు ప్రాంతీయ పార్టీల ఉనికి దెబ్బతింది. ఇవి తిరిగి కోలుకుంటాయన్న నమ్మకం కూడా కలగడం లేదు. ఈ పార్టీలన్నీ పార్లమెంట్‌లో తమ గొంతు వినిపించే అవకాశాన్ని కోల్పోయాయి. ఈ పార్టీలన్నీ ఒకప్పుడు ముఖ్యమంత్రులను,ఒకానొక సందర్భంలో పార్లమెంట్‌కు విశేష సంఖ్యలో ఎంపిలను పంపించినవేనని గుర్తించాలి. 1997లో బిజూ జనతాదళ్ ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఎలాంటి ఎదురీత లేని పార్టీ ఇప్పుడు పార్లమెంట్‌లో తన ప్రాతినిధ్యం అన్నది లేకుండా పోయింది. మొట్టమొదటిసారి 2009 తరువాత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్టీ మెజార్టీ సాధించుకోలేకపోయింది. గత 24 ఏళ్లుగా తిరుగులేని ముఖ్యమంత్రిగా నెగ్గుకుంటూ వచ్చిన నవీన్ పట్నాయక్ ఇప్పుడు పక్కకు తప్పుకోవలసి వచ్చింది. ప్రాంతీయ పార్టీల్లో ఒకప్పుడు మిగతా పార్టీలన్నిటినీ తుడిచిపెట్టేసిన బిజూ జనతాదళ్ పార్టీ ఇప్పుడు ఈ ఏడాది ఒక్క సీటు కూడా సాధించలేని స్థితికి దిగజారిపోయింది. ఉత్తరప్రదేశ్‌లో మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీది కూడా ఇదే పరిస్థితి. ఒకప్పుడు దళితుల గొంతుగా గుర్తింపు పొందిన బిఎస్పీ ఉత్తరప్రదేశ్‌లో తన పట్టును కోల్పోయే పరిస్థితి దాపురించింది. హర్యానాలో ఉత్తర ఎగువ నియోజక వర్గంలో జననాయక్ జనతా పార్టీ కూడా రాష్ట్రంలోని తనకున్న పది స్థానాలను కోల్పోయింది. ఇంకా దక్షిణాదిలో తమిళనాడుకు చెందిన ఆల్ ఇండియా అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎడిఎంకె)ను అగ్రనటుడు, ఎంజిఆర్ స్థాపించగా, తరువాత నటి జయలలిత సారథ్యం వహించారు. ఆమె ఉన్నంతకాలం పార్టీ బాగా నడిచింది. ఆటుపోట్లను ఎదుర్కొంది.. కానీ ఇప్పుడా పార్టీకి మనుగడ లేనట్టుగానే భావించాలి. ఇక తెలంగాణలోనూ దశాబ్దం పాటు పాలించిన కెసిఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓటమి చెందారు. ఆరు నెలల వ్యవధిలో వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపి సీట్లలో ఒక్కటి కూడా గెలవలేదు. ప్రజల్లో పునాది వేసుకుంటే తప్ప నిలబడవని గుర్తించాలి. టిడిపి అలాకాకుండా ప్రజలతో నిరంతరాయంగా పెనవేసుకుని ముందుకు సాగేలా చేసుకోవడం వల్లనే నిలబడ గలిగింది. తన ప్రజాస్వామ్య మూలాలను ఎక్కడా వదులుకోకపోవడం వల్లనే ఇది సాధ్యం అయ్యింది. అందువల్ల కేంద్రంలో కీలకంగా ఉన్నందున, ప్రజావ్యతిరేక నిర్ణయాలను అంతర్గతంగా చర్చించాలి. జిఎస్టీ వంటి బాదుళ్లపైనా చర్చించాలి. అలాగే యూపిఎ పేమెంట్లపైనా చర్చించాలి. అప్పుడే చంద్రబాబుకు విలువ పెరుగుతుంది. భాగస్వామ్య పక్షాలు పట్టుబిగిస్తేనే ప్రజాస్వామ్య వ్యతిరేక నిర్ణయాలపై మోడీ వెనకడుగు వేస్తారు.

# ప్రతిధ్వనించిన భారత్ సందేశం




జమ్మూ కాశ్మీర్: పహల్గాం ఉగ్రదాడి పాకిస్తాన్ ప్రోద్భలంతో జరిగిన సంగతి తెలిసిందే. అమాయక ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకున్న ఈ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్‌లోని ఉగ్ర స్థావరాలను మట్టుబెట్టింది. అత్యంత సాహసోపేతమైన ఈ ఆపరేషన్ సిందూర్ దాడులు భారత్ చరిత్రలో చెప్పుకోదగిన ఘట్టం. ఇంతటితో ఆగిపోకుండా పాక్‌లో ఉగ్రవాదులు ఎక్కడ దాగున్నా లోపలికి చొరబడి ఆపరేషన్ సిందూర్ దాడులు కొనసాగుతుంటాయని భారత్ తన వైఖరిని స్పష్టం చేస్తోంది. ఉగ్రమూకలకు శిక్షణ కేంద్రంగా తయారైన పాక్ ప్రభుత్వ ఉగ్రవాద అనుకూల విధానాలను ఎండగడుతూ భారత్ వాణిని బలంగా ప్రపంచ దేశాలకు స్పష్టం చేయడానికి కేంద్రం పంపించిన ప్రతినిధి బృందాలు 32 విదేశాల రాజధానుల్లో, యూరోపియన్ యూనియన్‌లో పర్యటించాయి. ఈ ఏడు బృందాల్లో మొత్తం 59 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో చాలావరకు పార్లమెంట్ సభ్యులు, మాజీ దౌత్యవేత్తలు ఉన్నారు. ఉగ్రవాదంపై పోరులో అంతా ఏకతాటిపై ఉన్నామనే జాతీయ ఐక్యతా సందేశాన్ని ప్రపంచ దేశాలకు వీరు చక్కగా అందించగలిగారు. నిర్దేశించిన లక్ష్యం పూర్తి చేసుకుని స్వదేశానికి తిరిగి వచ్చిన ఈ ప్రతినిధి బృందాలతో ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తన అధికారిక నివాసంలో భేటీ అయ్యారు. ప్రతినిధుల పర్యటన అనుభవాలను తెలుసుకుని వారిని ప్రశంసించారు. ప్రపంచ దేశాలకు భారత్ అందించే సందేశం విదేశీ ప్రభుత్వాలకే కాదు, చట్టసభ్యులకు, విదేశీ మీడియా, సామాన్య ప్రజానీకం వరకు చేరాలన్నదే భారత ప్రభుత్వ ఉద్దేశం. అంతేకాదు, ముఖ్యంగా ఏయే దేశాల్లో భారత్‌కు మద్దతు లభించదని భావిస్తుంటారో ఆ దేశాలకు కూడా ఈ సందేశం అందించడం విశేషం. భారత ప్రతినిధి వర్గం సందర్శించిన దేశాలు చాలావరకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సభ్యదేశాలు. భద్రతా మండలి అశాశ్వత సభ్యులుగా ఉన్నవి. వచ్చే సంవత్సరం భద్రత మండలిలో సభ్యత్వం పొందనున్నవి కూడా ప్రతినిధి బృందం సందర్శించిన వాటిలో ఉన్నాయి. ఇది చాలా అవసరం. ఎందుకంటే 2025 26 సంవత్సరానికి సంబంధించి భద్రతా మండలి సభ్యదేశంగా పాకిస్థాన్ ఎన్నికైన నాటి నుంచి భారత్‌కు భద్రతా మండలి తీర్మానాల్లో చిక్కులు ఎదురవుతున్నాయి. ఏదైనా ప్రపంచ స్థాయి సమస్యలపై మండలి తీర్మాన పాఠాన్ని కూడా మార్పు చేయగలదు. పహల్గాం ఉగ్రదాడికి తామే బాధ్యులమన్న కశ్మీర్‌లోని ఉగ్రవాద సంస్థ 'ది రెసిస్టెంట్ ఫ్రంట్' ప్రకటించినప్పటికీ దాన్ని ఉదాహరణగా చూపించడానికి పాక్ ఒప్పుకోవడం లేదు. ఆ మేరకు భద్రతా మండలి తీర్మాన పాఠంలో ప్రస్తావించినా మార్పు చేసే తెలివి పాకిస్తాన్‌కు ఉంది. ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్‌కు ఐక్యరాజ్యసమితి కీలక బాధ్యతలు కట్టబెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఉగ్రవాద నిరోధక కమిటీకి వైస్ ఛైర్మన్‌గా పాక్ ఎన్నిక కావడమే కాకుండా తాలిబన్ల ఆంక్షల కమిటీ బాధ్యతలను కూడా పాక్ చేపట్టడం విడ్డూరం. పహల్గాం ఉగ్రదాడికి బాధ్యులైన ఉగ్రవాదులను ఐక్యరాజ్యసమితి తీర్మానాల ద్వారా జవాబుదారులుగా నిలబెట్టడానికి భారత్ విశ్వప్రయత్నం చేస్తోంది. ఫైనాన్షియల్ టాస్క్‌ఫోర్సు వద్ద కూడా పాక్‌కు అడ్డుకట్ట వేయాలని భారత్ ప్రయత్నాలు ఫలించలేదు. అమెరికా, చైనా వంటి అగ్రరాజ్యాలకు మాత్రమే కాక, ఐక్యరాజ్యసమితి, ఐఎంఎఫ్ వంటి ప్రపంచస్థాయి సంస్థలకు కూడా పాక్‌పై వల్లమాలిన ప్రేమ పుట్టుకొస్తుంది. ప్రతినిధి బృందం న్యూయార్క్, వాషింగ్టన్ వెళ్లినప్పుడు పాక్ చర్యలను ఎండగట్టడంపైనే దృష్టి పెట్టింది. భారత్ పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే మధ్యవర్తిత్వం వహించానని, వాణిజ్య సంబంధాలను ఉపయోగించి అణుయుద్ధం తప్పించగలిగానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాహాటంగా వ్యాఖ్యానించడం కాస్త ఉద్రిక్తతలకు దారితీసింది. అందుకనే అమెరికాలో ప్రతినిధి బృందం పర్యటించడం ఎంతైనా ఇప్పుడు అవసరమేనని దౌత్యవేత్తలు సమర్థిస్తున్నారు. ఈ పర్యటనలు ఎంతవరకు విజయవంతమయ్యాయో చూస్తే భారత్‌లో కొన్నివిమర్శలు వినిపించాయి. ప్రతినిధి బృందాలు ఆయాదేశాల్లో భారతీయ సమాజాలతో మాట్లాడడానికే ఎక్కువ సమయం వెచ్చించారని, ఆయాదేశాల్లోని దౌత్యవేత్తలను ప్రభావితం చేయడానికి బదులు భారత మీడియా వర్గాలతోనే ఇంటర్వ్యూలు ఇవ్వడం చేశారని విమర్శలు వచ్చాయి. ప్రతినిధుల బృందాలు పాక్ పట్ల తమ దేశ దృఢమైన వైఖరిని సరిగ్గా వినిపించలేక పాకిస్తాన్, భారత్ మధ్య కుక్కపిల్లి వైరం ఉన్నట్టు వాదించడమే ఎక్కువగా కనిపించిందన్న ఆరోపణలు వచ్చాయి. ఏదెలాగున్నా భారతదేశ భద్రత, సమగ్రత, ఐక్యతపై జాతీయ స్పృహ ప్రతిబింబించేలా ప్రతినిధి బృందాల విస్తృతమైన సందేశం అత్యంత శక్తివంతంగా పనిచేసింది. భారత్‌లో మోడీ ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం క్షీణిస్తోందని, మెజారిటీవాదమే తీవ్రంగా మారుతోందని అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న తరుణంలో ప్రతినిధి బృందాలు పార్టీలకు, సిద్ధాంతాలకు అతీతంగా ఒకే మాటగా, ఒకే బాటగా ప్రపంచానికి భారతదేశ సమైక్యత, భద్రతపై దృఢమైన సంకల్పాన్ని చాటిచెప్పడం ఎంతైనా ముదావహం. ప్రతినిధుల ఎంపికలో కూడా కేంద్ర ప్రభుత్వం తెలివిగా వ్యవహరించింది. విదేశాల్లో భారత్ పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించి, బహుళ వైవిధ్య భాషా, సాంస్కృతికత చిత్రాన్ని ప్రదర్శించాలన్న దూరదృష్టితో సమర్థులను ఏరికోరి ఎంచుకుంది. రాష్ట్రాలనుంచి, పార్టీలకు అతీతంగా, అనుభం గలిగిన సీనియర్ రాజకీయ నేతలు ప్రతినిధి వర్గాల్లో చోటుచేసుకున్నారు. వీరి లౌకికవాదం, సామరస్యం, సుహృద్భావం ఫలితంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో ప్రతిధ్వనులు వినిపిస్తాయన్న అభిప్రాయం కలుగుతోంది.

# విమాన ప్రమాద ఘటనలో ఒకేఒక్కడు

అహ్మదాబాద్, అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో ఒకే ఒక్కడు బతికాడు. అతను మృత్యుంజయుడిగా నిలిచాడు. విశ్వాస్ కుమార్ రమేష్ లండన్ వెళుతున్న ప్రయాణికుల్లో బతికి బయటపడ్డాడు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానం కొన్ని సెకెన్లలోనే కూలిపోయిన సంగతి తెలిసిందే. మొత్తం 242 మంది ప్రయాణికులతో వెళ్తున్న విమానం ఒక్కసారిగా కూలిపోయి మంటల్లో చిక్కుకుంది. భారీ ప్రాణనష్టం సంభవించింది. ఈ విమానంలో ప్రయాణిస్తున్న అందరూ ప్రాణాలు కోల్పోయారని వార్తలు వచ్చాయి. అయితే ఒక్క వ్యక్తి అంత పెద్ద దుర్ఘటన నుంచి ప్రాణాలతో బయటపడ్డాడు. అంత పెద్ద ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఆ వ్యక్తి పేరు విశ్వాస్ కుమార్ రమేష్. భారత సంతతికి చెందిన ఇతడికి బ్రిటన్ పౌరసత్వం ఉంది. భారత్‌లో ఉంటున్న తన కుటుంబ సభ్యులను కలిసేందుకు అతడు ఇటీవల ఇక్కడి వచ్చాడు. తిరిగి లండన్ వెళ్లేందుకు ఎయిరిండియా విమానం ఎక్కాడు. అతడు తన సోదరుడితో కలిసి ప్రయాణిస్తున్నాడు. ఆ సోదరుడి ఆచూకీ మాత్రం ఇప్పటివరకు లభ్యం కాలేదు. విశ్వాస్ ఎయిరిండియా విమానంలో సీట్ నెంబర్ 11ఆలో కూర్చుని ప్రయాణిస్తున్నాడు. హాస్పిటల్‌లో చికిత్స అనంతరం స్పృహలోకి వచ్చిన విశ్వాస్ ప్రమాదం తర్వాత తన పరిస్థితిని వివరించాడు. నాకు స్పృహ వచ్చే సరికి నా చుట్టూ మృతదేహాలున్నాయి. నాకు చాలా భయం వేసింది. నేను పైకి లేచి పరిగెత్తాను.

# ఢిల్లీని ఠారెత్తిస్తున్న ఎండలు

న్యూఢిల్లీ,దేశంలోకి రుతుపవనాలు ప్రవేశించి చాలా రోజులైంది. అలాగే జూన్ మాసం కూడా సగం రోజులైపోతుంది. కానీ ఉష్ణోగ్రతల్లో మాత్రం మార్పు రాలేదు. కొన్ని రాష్ట్రాల్లో వర్షాలు దంచికొడుతుంటే.. ఇంకొన్ని రాష్ట్రాల్లో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. తీవ్ర వడగాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా దేశ రాజధాని ఢిల్లీలో భానుడు భగభగ మండిపోతున్నాడు. ఢిల్లీలో ప్రస్తుతం 52 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ఢిల్లీ, పంజాబ్‌లో కేంద్ర వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. పగలు ఎండలు ఎక్కువగా ఉంటాయని.. సాయంత్రం మాత్రం ఉపశమనం లభించొచ్చని ఐఎండీ తెలిపింది. అంతేకాకుండా సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొంది. వేడిగాలులతో జాగ్రత్తగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొంది. చిన్న పిల్లలు, వృద్ధులు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. అత్యవసర పరిస్థితులైతే తప్ప బయటకు వెళ్లొద్దని హెచ్చరించింది. ఉత్తరాది రాష్ట్రాల్లో ఎండలు మండిపోతుంటే.. దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాలు చురుకుగా ఉన్నాయని ఐఎండీ అంచనా వేసింది. ఈ వారంలో ఆయా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. జూన్ 20 నాటికి హిమాచల్ ప్రదేశ్‌కు, జూన్ 27 నాటికి పంజాబ్‌కు రుతుపవనాలు చేరుకుంటాయని అంచనా వేసింది. ఇక ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మధ్యాహ్నం సమయంలో ప్రజలు ఇంటి లోపలే ఉండాలని, కఠినమైన కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, నీరు ఎక్కువగా తాగాలని, తలతిరగడం, అలసట, గుండె కొట్టుకోవడం వంటి వడదెబ్బ లక్షణాల కోసం జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య అధికారులు ప్రజలను కోరారు.

# చిత్రపరిశ్రమలో మరో విషాదం

గుంటూరు, ప్రముఖ దర్శకుడు ఏఎస్ రవి కుమార్ మృతిని మరిచిపోకముందే టాలీవుడ్ ఇండస్ట్రీలో మరో విషాదం చోటుచేసుకుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో సీనియర్ నిర్మాతగా, ఏఏ ఆర్ట్స్ అధినేతగా పేరు గాంచిన కె. మహేంద్ర (79) బుధవారం అర్ధరాత్రి కన్నుమూయడంతో ఇండస్ట్రీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. కె. మహేంద్ర మరణవార్తతో పలువురు సినీ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. కే మహేంద్ర పూర్తి పేరు కావూరి మహేంద్ర కాగా, ఆయన స్వస్థలం గుంటూరు. ఫిబ్రవరి 4, 1946లో జన్మించారు. దర్శకుడు కావాలని అనుకున్నారు. సీనియర్ దర్శకులు కే ప్రత్యగాత్మ, కే హేమాంభరధర రావు దగ్గర దర్శకత్వ శాఖలో పని చేశారు. ప్రొడక్షన్ కంట్రోలర్ కింద పలు చిత్రాలకు ఆయన సేవలు అందించారు. 'ప్రేమించి పెళ్లి చేసుకో (1977) చిత్రం సినిమాతో నిర్మాతగా మారారు. ఆ తర్వాత 'ఏది పుణ్యం? ఏది పాపం?', 'ఆరని మంటలు', 'తోడు దొంగలు', 'బందిపోటు– రుద్రమ్మ', 'ఎదురలేని మొనగాడు', 'ధాకూరాణి', ప్రచండ భైరవి', 'కనకదుర్గ వ్రత మహాత్మ్యం' తదితర చిత్రాలు మహేంద్ర నిర్మించారు. శ్రీహరిని హీరోగా పరిచయం చేస్తూ 'పోలీస్' చిత్రం నిర్మించిన ఆయన మళ్లీ శ్రీహరితోనే 'దేవా' సినిమాను నిర్మించారు. మహేంద్రకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన కుమార్తెను మాదాల రవి వివాహం చేసుకున్నారు. కొద్దికాలం క్రితమే మహేంద్ర తనయుడు జీతు మరణించాడు. కాజల్ అగర్వాల్ తెలుగు తెరకు పరిచయమైన నందమూరి కళ్యాణ్ రామ్ – దర్శకుడు తేజల 'లక్ష్మీ కళ్యాణం' నిర్మించింది మహేంద్రనే. యాంగ్రీ స్టార్ రాజశేఖర్ హీరోగా 'అర్జున్', ఊహ నటించిన 'ప్రేమ లేని పుట్టిల్లు', కరోనాకు ముందు పోసాని కృష్ణమురళి నటించిన 'దేశముదుర్లు' సినిమాలు కూడా మహేంద్ర కూడా ఈయన నిర్మాణంలో రూపొందినవే.. రాజశేఖర్ నటించిన 'అర్జునా' సినిమా ఇంకా విడుదల కాలేదు. అయితే కుమారుడి మరణం మహేంద్రను మానసికంగా కుంగదీసిందని సన్నిహితుల సమాచారం.

# అందినకాడికి దోచేస్తున్నారా..?

అమరావతి, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని ఆధిపత్యాన్ని చూపించింది జనసేన. జిల్లాలోని ఆరు సీట్లలో పోటీ చేసి అన్ని చోట్ల విజయం సాధించి కంచుకోటగా నిలబడింది. అలాంటి జిల్లాలో పార్టీ అధినేత ఆశించిందొకటి.. ఎమ్మెల్యేలు చేస్తున్నదొకటి అన్నట్టుగా తయారైందట పరిస్థితి. ఇక్కడి నుంచి తొలిసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన జనసేన నేతలు.. మళ్ళీ అవకాశం వస్తుందో లేదో%ా% భవిష్యత్తు సంగతి మనకెందుకు, దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామన్నట్టు ఆత్రంగా వ్యవహరిస్తున్నారట. గీత దాటుతూ ఇప్పుడు కాకుంటే ఇంకెపుడు అన్నట్టుగా చేస్తున్న పనులు చూసి జనసేన నేతలే అవాక్కవుతున్నట్టు చెప్పుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి తొలిసారి అసెంబ్లీకి వెళ్ళిన వారిలో నర్సాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఉంగుటూరు శాసనసభ్యుడు పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. ఇక సీనియర్ నాయకుల లిస్టులో భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నిడదవోలు ఎమ్మెల్యే కమ్ మంత్రి కందుల దుర్గేష్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. సీనియర్ల సంగతి పక్కనపెడితే పోలవరం, నర్సాపురం, ఉంగుటూరు ఎమ్మెల్యేల అనుచరులు మాత్రం దున్నేస్తున్నారన్న టాక్ ఉంది జిల్లాలో. ఏ పనిచేయాలన్నా, ఏ కాంట్రాక్ట్ దక్కించుకోవాలన్నా, మద్యం వ్యాపారం చేయాలన్నా%ా% షాడోలుగా మారిన ఎమ్మెల్యేల అనుచరగణానికి భారీగా ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తున్నట్టు చెప్పుకుంటున్నారు. మంచా చెడా అన్నదాంతో సంబంధం లేదు. పని ఏదైనా సరే ఫిక్స్ చేసిన పర్సంటేజ్ ముట్టజెపితే చాలు. పూర్తి స్థాయిలో సహకరిస్తారట. ఆయా నియోజకవర్గాల్లో ఇది ఓపెన్ టాక్ అంటున్నారు. నరసాపురంలో MLA బొమ్మిడి నాయకర్ సోదరుడితో సహా మరికొంత మంది నేతలు ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేస్తున్నారన్న ఆరోపణలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఇటీవల సివిల్ తగాదాల్లో సైతం ఎమ్మెల్యే మనుషులు తలదూర్చి సెటిల్మెంట్స్ చేయడం వివాదాస్పదమవుతున్నట్టు చెబుతున్నారు. నరసాపురం నియోజకవర్గంలో ఏ వ్యాపారం మొదలుపెట్టాలన్నా ముందు నాయకర్‌కు కావాల్సిన వాళ్ళని కలిస్తేనే పనవుతుందని, వాళ్ళకు సమర్పించుకోకుంట ఏ పనీ చేయలేరన్న ప్రచారం జోరుగా ఉంది. మట్టి తవ్వకాల విషయంలో జనసేన నేతల ఆగడాలపె మిత్రపక్షం టీడీపీ నాయకులే ఫిర్యాదు చేసేవరకు వెళ్ళిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నది లోకల్ వాయిస్. ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు, తమ సామాజికవర్గానికి చెందిన వారితో సెటిల్మెంట్స్‌లాంటి ఆరోపణలు పెరుగుతున్నాయి. తొలిసారి ఎమ్మెల్యే అయిన నాయకర్ సలహాదారులు, సెటిల్మెంట్ చేసే బ్యాచ్‌తో పెద్ద కోటరీనే ఏర్పాటు చేసుకున్నారని జనసేన నేతలే గుసగుసలాడుకుంటున్నారట. ఇక పోలవరం విషయంలోనూ ఇదే పరిస్థితి. ఎమ్మెల్యే మనుషులమంటూ కొంతమంది అక్రమాలకు తెరలేపడంతో నియోజకవర్గంలో చులకన భావం ఏర్పడుతోందని తెగమథన పడిపోతున్నారట తెలుగు తమ్ముళ్ళు. జనసేన ఎమ్మెల్యే పనులు తమకు తలవంపులు తెస్తున్నాయన్నది వాళ్ళ వాదనగా తెలుస్తోంది. మొత్తం ఏడు మండలాల్లో ఎమ్మెల్యే షాడోస్‌ని పెట్టుకుని బీభత్సంగా వసూళ్ళకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు పెరుగుతున్నాయి. అయితే కొన్ని విషయాలపై ఎమ్మెల్యేకు అవగాహన తక్కువ ఉందని భావిస్తున్న కొందరు చోటామోటా నేతలు ఆయన దృష్టికి తీసుకురాకుండానే

# తెలియదు...జ్ఞాపకం లేదంటూ సమాధానం

హైదరాబాద్, తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణ ముగిసింది. ప్రభాకర్ రావును 9 గంటల పాటు సిట్ అధికారులు విచారించారు. జూన్ 14న మరోసారి విచారణకు రావాలని సిట్ అధికారులు ఆదేశించారు. నేడు సుదీర్ఘంగా ప్రభాకర్ రావుని సిట్ ప్రశ్నించింది. చాలా ప్రశ్నలకు ఎస్ఐబీ మాజీ చీఫ్ సమాధానాలను దాటవేశారు. కొన్ని ప్రశ్నలకు అధికారికం, వ్యక్తిగతం అంటూ సమాధానాలు ఇచ్చారు. ఇంకొన్ని వాటికి అయితే తెలీదు, గుర్తులేదు అంటూ ప్రభాకర్ రావు సమాధానం ఇచ్చారు. కొంత సమాచారాన్ని ధ్రువీకరించలేను అంటూ సిట్ అధికారులతో చెప్పారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో జూన్ 14న ప్రభాకర్ రావు, ప్రణీత్ రావులను కలిపి సిట్ విచారించనునట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రభాకర్ రావు నుంచి సిట్ స్వాధీనం చేసుకోలేదు. అయితే కొన్నింటికి రాత పూర్వకంగా సమాధానాలు తీసుకుంది. జూన్ 9న ప్రభాకర్ రావు సిట్ ముందు హాజరైన విషయం తెలిసిందే. సిట్ అధికారులు ఆయనను దాదాపు 8 గంటల పాటు- విచారించారు. ఈ కేసులో ఇప్పటివరకు సేకరించిన ఆధారాలను ముందు ఉంచి ప్రశ్నించారు. 2023 అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు జరిగిన ఉప ఎన్నికల సమయంలో ఆయన వాడిన అధికారిక, అనధికారిక సెల్‌ఫోన్లను తమకు అప్పగించాలని సిట్ అధికారులు మొదటిరోజు ఆదేశించారు. సెల్‌ఫోన్లతో పాటు- ల్యాప్‌టాప్, మ్యాక్ నోట్‌బుక్‌లను సైతం తీసుకురావాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఏ1గా ఉన్నారు. కేసు నమోదైన సమయంలోనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయన తిరిగి రాకపోవడంతో పోలీసులు పాస్‌పోర్టు రద్దు చేయించారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు విచారణకు సహకరించేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్‌తో జూన్ 8న రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఇప్పటికే ప్రణీత్ రావు, రాధాకిషన్ రావు, భుజంగ రావు, తిరుపతన్నను సిట్ అధికారులు అరెస్టు చేశారు. వారు ఇచ్చిన సమాచారం ఆధారంగా ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు- తెలుస్తోంది.

# ఆర్థిక విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నాం

అమరావతి, కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్‌ది చాలా కీలక పాత్ర.. పాలసీ మేకింగ్, వాగ్దానాల అమలు విషయంలో పవన్ కల్యాణ్ అన్నిటినీ సమన్వయం చేస్తూ ముందుకెళ్తున్నారు. కూటమిలో జనసేనకు ఎక్కువ బాధ్యత ఉంది.. ప్రజలకోసం కూటమికి జనసేన ఎప్పుడూ సహకరిస్తుందని జనసేన పీఏసీ చైర్మన్, ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.. కూటమి ఏడాది పాలన పై మాట్లాడిన ఆయన.. అమరావతి, పోలవరం వంటి కీలక అంశాలపై దృష్టి సారించి అభివృద్ధిని కొనసాగిస్తున్నాం అన్నారు. సూపర్ 6 కార్యక్రమాలను అమలు చేస్తున్నాం.. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు మేం సవాల్ చేస్తున్నాం.. డిబేట్‌కు రెడీ.. ప్రభుత్వం పాలనలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. పారదర్శకంగా టెక్నాలజీని ఉపయోగించి సంక్షేమాన్ని ప్రజలకు చేర్చుతున్నాం. వైసీపీ పాలన విచిత్రంగా, అనుభవం లేక, స్వలాభం కోసం వ్యవస్థను దుర్వినియోగం చేశారు. సంక్షేమం పేరుతో ప్రలోభాలు పలికారు.. పరిపాలనపై ఏనాడూ దృష్టి పెట్టలేదు.. వ్యవస్థకు అపార నష్టం కలిగింది.. కేంద్రం నుంచి 100 శాతం సహకారం అందుతోంది. గతంలో కన్నా ఇప్పుడు ఎక్కువ అండగా కేంద్రం నిలబడుతుంది.. ప్రజలకు పథకాలు సరిగ్గా అందించామని గుర్తించి కేంద్రం సహకరిస్తోందన్నారు.కొన్ని ఛాలెంజెస్ పాలనలో ఉన్నాయి.. గతంలో వ్యవస్థలను దుర్వినియోగం చేసి అరాచక పాలన చేశారు.. గాడితప్పిన వ్యవస్థను సెట్ చేస్తూ.. ప్రజల కోసం అంకితభావంతో పనిచేయడానికి కొంత సమయం పడుతుందన్నారు.. ఆర్థికంగా రాష్ట్రం చాలా దెబ్బతింది. ఎప్పుడూ లేనివిధంగా అప్పులు, ఏ పని చేయాలన్నా కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది.. ఇవి అన్ని అధిగమించి సంక్షేమం చేస్తున్నాం.. ఇప్పుడు జాగ్రత్తగా, పద్ధతిగా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నాం. ఒకవైపు సంక్షేమం.. మరోవైపు అభివృద్ధిని కలిపి ముందుకు వెళ్తున్నాం. టీమ్ వర్క్‌తో సవాళ్ల మధ్య కూడా స్మూత్ గవర్నెన్స్ కొనసాగుతోందని తెలిపారు. పోలవరం, అమరావతి పైన కేంద్ర మద్దతు స్పష్టంగా ఉంది.. రాష్ట్రానికి ఎటు-వంటి ఇబ్బంది లేకుండా కేంద్రం సహాయం చేస్తోందన్నారు నాదెండ్ల మనోహర్.. కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్‌ది చాలా కీలక పాత్ర. పాలసీ మేకింగ్, వాగ్దానాల అమలు విషయంలో పవన్ కల్యాణ్ అన్నిటినీ సమన్వయం చేస్తూ ముందుకెళ్తున్నారు. కూటమి పాలనలో సమన్వయానికి కొంత సమయం పడుతుంది. ఇప్పుడు ప్రభుత్వ పరిపాలనపై పూర్తిగా దృష్టి సారించాం. కూటమిలో జనసేనకు ఎక్కువ బాధ్యత ఉంది. ప్రజలకోసం కూటమికి జనసేన ఎప్పుడూ సహకరిస్తుంది. మొదటి ఏడాది పాలనపై స్పష్టమైన దృష్టితో ముందుకెళ్లాం. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేస్తాం. కమిటీ-లను ఏర్పాటు- చేసి యువతకు ఎక్కువ అవకాశాలు కల్పిస్తాం. కొత్త తరానికి రాజకీయాల్లోకి జనసేన తీసుకొస్తోంది. యువతను రాజకీయాల్లోకి తీసుకువచ్చి, పాలిటిక్స్‌లో పెనుమార్పులు తేవడమే లక్ష్యం అన్నారు.. ప్రజలకు మేలు చేసే విషయంలో బలమైన విశ్వాసంతో ముందుకు సాగుతాం.

# సత్తా చాటుతుందన్న ధీమా

కరీంనగర్, స్థానిక ఎన్నికల కోసం బిఆర్ఎస్ క్యాడర్ ఎదురు చూస్తోంది. ఎన్నికల్లో సత్తా చాటాలని చూస్తున్నారు. ఇప్పటికైతే పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నా, స్థానిక ఎన్నికల్లో మా÷-రం ప్రభావం చూపుతామని స్థానిక నేతలు ధీమాగా ఉన్నారు. ఉత్తర తెలంగాణ ఎప్పుడూ బిఆర్ఎస్‌కు కంచుకోటగా ఉండేది. మెదక్ ఇక చెప్పాల్సిన పనిలేదు. అయితే బిఆర్ఎస్ స్వయంకృతం కారణంగా ఆ పార్టీ ఎక్కడా ఉనికి లేకుండా పోతోంది. గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తరవాత ఇప్పుడుమరింత ప్రాభవాన్ని కోల్పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టక పోవడంతో పార్టీ కేడర్‌లో నిస్తేజం ఆవరించింది. ప్రజాందోళనల మాట ఎలా ఉన్నా కనీస కార్యక్రమాలు కూడా సాగడం లేదు. మరో మూడున్నరేళ్ల వరకు దానికి భవిష్యత్ లేనట్లుగానే భావించాలి. కరీంనగర్ మేయర్, జగిత్యాల ఎమ్మెల్యే ఇలా ఒక్కొక్కరుగా బిఆర్ఎస్‌ను వీడారు. నిజానికి కరీంనగర్ బీఆర్ఎస్‌కి కంచుకోట. టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ప్రతి ఎన్నికలో సత్తా చాటింది. అంతే కాకుండా కరీంనగర్‌ని, బీఆర్ఎస్‌ను విడదీయలేని పరిస్థితి. ఇక్కడ నెగ్గితే తెలంగాణ అంతా పాజిటివ్ ఫలితాలు వస్తాయనే సెంటిమెట్ ఉండేది. 2019 ఎన్నికల నుంచి బీఆర్ఎస్ కంచుకోటకి బీటలు వారుతున్నాయి. పార్లమెంటు ఎన్నికలలొ కనీసం పోటీ కూడా ఇవ్వకుండా మూడవ స్థానానికే పరిమితం కావడం గమనార్హం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గులాబీ పార్టీ అనుకూల ఫలితాలు సాధించింది. తెలంగాణ ఉద్యమ సమయంలొ జరిగిన ఉప ఎన్నికలలో గులాబిజెండా రెపరెపలాడింది. తెలంగాణ ఆవిర్భావం తరువాత జరిగిన రెండు అసెంబ్లీ ఎన్నికలలో క్లీన్‌స్వీప్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో తొంభై ఐదు శాతానికి పైగా ఫలితాలు సాధించింది. ఈజిల్లాలో బీఆర్ఎస్‌కు ఇక తిరుగులేదన్న సమయంలో 2019 ఎన్నికలలో బిఆర్ఎస్ కి మొదటిషాక్ తగిలింది.

# పార్టీల్లో ప్రజాస్వామ్యం బలపడాలి !

హైదరాబాద్,తెలుగుదేశం పార్టీ ఏర్పడిన నాటి నుంచి ఏనాడూ ఏకపక్షంగా వ్యవహరించలేదు. కుటుంబం అదుపులో పార్టీ ఉన్నా ఉమ్మడి నిర్ణయాలు, ప్రజాస్వామ్య విధానాలతో ముందుకు సాగుతోంది. గతేడాది కూటమిగా జనసేన, బిజెపితో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరవాత కూడా తెలుగుదేశం పార్టీ ఏనాడూ ప్రజాస్వామిక గీతను దాటలేదు. లోకేష్‌ను తన వారసుడిగా పార్టీలో ఎదిగేలా చేస్తున్నా..టిడిపి ఎప్పుడూ ప్రజల పక్షంగానే సాగుతోంది. పవన్ కళ్యాణ్ జనసేన, బిజెపిల కలయికతో ఇప్పుడు ఎపిలో కూటమి ఓ మంచి పాలన అందించగలుగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ మాత్రం ఇంకా అధిష్టానం అడుగులకు మడుగులు ఒత్తుతూ సాగుతోంది. కాంగ్రెస్ తన విధానాలు మార్చుకోవడం లేదు. పార్టీ సోనియా కుటుంబం కబంధ హస్తాల్లో ఉండడం వల్ల ప్రతి నిర్ణయానికి స్వేచ్ఛగా వ్యవహరించే అవకాశం లేదు. అందుకే సిఎం రేవంత్ రెడ్డి ప్రతి చిన్ని విషయానికి ఢిల్లీకి పరుగెత్తాల్సి వస్తోంది. మంత్రివర్గ విస్తరణ ఏడాదిన్నర దాటిన తరవాత చేపట్టినా, శాఖల కేటాయింపు కూడా మళ్లీ అధిష్టానం నిర్ణయంతో వారి కనుసన్నల్లోనే సాగాయి. బిఆర్ఎస్‌లో కూడా కెసిఆర్, కెటిఆర్ నిర్ణయాలే ఫైనల్. వారికీ కాంగ్రెస్‌కు పెద్దగా తేడా ఉండదు. కానీ తెలుగుదేశంలో పొలిట్ బ్యూరో,కార్యవర్గం తదితర ఏర్పాట్లు ఉన్నాయి. భారతదేశం పునాదులే ప్రజాస్వామి క వ్యవస్థపై ఉన్నాయి. రాజకీయ పార్టీలు కూడా ఇదే విధానం అవలంబించి, ప్రజల్లో ఉన్నంతకాలం మనగలుగుతాయి. అలాకాకుండా ఏకపక్ష, నిరంకుశ, కుటుంబ పాలనకు కట్టుబడితే అవి కాలక్రమంలో అంతర్ధానం అవుతాయి. తెలుగుదేశం పార్టీని స్థాపించిన స్వర్గీయ ఎన్టీ రామారావు ఓ ఉదాత్త ఆశయంతో రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన ఉన్నంత కాలం పార్టీని అదే ఆశయంతో నడిపించారు. పార్టీ ఏర్పాటుతో బడుగు, బలహీనవర్గాలకు రాజకీయ ప్రవేశం దక్కింది. ఎందరికో టిడిపి రాజకీయ ఆశ్రయం ఇచ్చింది. రాజకీయాల్లో ఒకప్పుడు పెత్తందారులే ఉండేవారు. ఎన్టీఆర్ వచ్చాక పరిస్థితి మారింది. బడుగు,బలహీన వర్గాలు ఎందరో రాజకీయాంగా ఎదిగారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గతంలో ఎప్పుడూ లేనంతగా మార్పులు తీసుకుని రావడంలో టిడిపి కీలక భూమిక పోషించింది.ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ప్రజల్లో నిరంతరంగా నిలిచి వారితో కలసి నడిచిన పార్టీగా ఇప్పటికీ టిడిపి ప్రధాన భూమిక పోషిస్తోంది. ప్రధానంగా బడుగు, బలహీన, అణగారిన వర్గాలకు రాజకీయ వేదికగా నిలిచింది. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం నింపింది. చంద్రబాబు నాయుడు పార్టీ పగ్గాలు అందుకున్నాక కూడా పార్టీని నిరంతరం ప్రజల్లో ఉండేలా చేయడంలో విజయం సాధించారు. ఆ మేరకు కృతకృత్యులు అయ్యారు. ఇది ప్రజల పార్టీ అని నిరూపించడం వెనక ఆయన శ్రమ ఉంది. అలాగే ఏనాడూ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోలేదు. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ కాలం నుంచి నేటి వరకు అధికారంలో ఉన్నా..లేకున్నా ప్రజల్లో నిలవడానికి కూడా కారణం అదే. అంకితభావం కలిగిన కార్యకర్తలు తోడుగా ఉన్నారు. పార్టీలోకి ఎందరో వచ్చినా.. ఎందరో వెళ్లినా, అధికారంలో ఉన్నా, అధికారంలో లేకున్నా పార్టీ మాత్రం ప్రజాస్వామ్య విలువలు చెక్కుచెదరలేదు. ఓ రకంగా చెప్పాలంటే చంద్రబాబు దక్షతకు ఇది నిదర్శనం. దేశంలో ఎన్నో పార్టీలు వచ్చాయి. పోయాయి. ఎందరో తెరమరుగు అయ్యారు. ఎన్నో పార్టీలు ప్రజల నుంచి దూరం అయ్యాయి. అయితే టిడిపి మాత్రం తన ఉనికిని చాటుతూ ప్రజల్లో నిరంతరంగా ఉండేలా ఎప్పటి కప్పుడు తన ప్రణాళికలు మార్చుకుంటూ ముందుకు సాగడంలో నాయకత్వం చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. తేడాది మరోమారు టిడిపి అధికారంలోకి వచ్చింది. జగన్



ఐదేళ్ల పాటు ఎంతగా వేధంచినా, రాష్ట్రాన్ని పక్కదాని పట్టించి అభివృద్ధిని పక్కన పడేసినా టిడిప తన పోరాటాన్ని వీడలేదు. కాలనుగణంగా ఎన్‌డిఎతో కలసి పోరాడింది. అంతిమంగా ఎపి అభివృద్ధి లక్ష్యంగా ఇప్పుడు అడుగులు వేస్తున్నారు. చంద్రబాబు 14 ఏళ్లు అధికారంలో, ఓ 15 ఏళ్లు విపక్షంలో ఉన్నా.. పార్టీని ఎక్కడా పట్టు సడలకుండా కాపాడుకోగలిగారు. కొందరు నేతలు పార్టీని విడిచి వెళ్లినా పట్టించుకోలేదు. గత ఐదేళ్లలో జగన్ చంద్రబాబునే టార్గెట్ చేసి,టిడిపిని అణచివేయాలని చూశారు. కేసులతో నేతలను జైల్లో వేయించారు. అలాగే అనేక రకాలుగా విధ్వంస పాలన చేసారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను పట్టించుకోలేదు. ఇదంతా విపక్షాల దుష్ప్రచారంగా ప్రచారం చేశారు. అయినా టిడిపి ఎక్కడా చెక్కుచెదరలేదు. తన పట్టును వీడలేదు. అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేసింది. ప్రజల్లో విశ్వాసం కలిగించింది. ఓ రకంగా చెప్పాలంటే ప్రాంతీయ పార్టీల్లో గట్టిగా నిలబడ గలిగిన పార్టీల్లో తెలుగుదేశం ముందుంటుంది. కానీ తెలంగాణలో బిఆర్ఎస్ నిత్యం సంక్షోభాలతో సాగుతోంది. కేవలం అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే నేతలు వెన్నంటి ఉన్నారు. కెసిఆర్ నిరంకుశ విధానాలు ఆ పార్టీని దెబ్బతీసాయి. ఈ విధానాలపై ఇప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోవడం లేదు. జగన్ లాగే అప్పులు చేసి, రాష్ట్రాన్ని దివాళా తీయించారు. ప్రజలు ఆదరించి అక్కున చేర్చు కుంటే కేసిఆర్ వారికే పంగనామాలు పెట్టి, పాలనలో దొరలపోకడలను చొప్పించి, నిరంకుశ విధానాలను అనుసరించారు. ప్రజలు ఇలాంటి పార్టీ మనకొద్దని ఎన్నికల్లో ఓడించారు. కానీ అధికారం చేపట్టిన కాంగ్రెస్ కూడా తన విధానాలు మార్చుకోకుండా ఏడాదిన్నరలోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను మూటగ్టటుకుంది. ప్రజాస్వామ్యబద్దంగా ఉన్న బిజెపిలో మోడీ నిరంకుశ విధానాలతో పార్టీని దిగజార్చారు. ఎన్‌డిఎ పక్షాలతో ఇప్పుడు ఆ పార్టీ నిలబడ్డా.. అవే విధానాలను మోడీ కొనసాగిస్తే..బిజెపిని కూడా ప్రజలు దూరం చేసుకుంటారని. మోడీ ద్వయం అనుసరించిన నిరంకుశ విధానాల కారణంగా గతేడాది ఎన్నికల్లో గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వచ్చింది. కాంగ్రెస్ ముక్త భారత్ నినాదంతో ప్రజలను పట్టించుకోక పోవడంతో ప్రజలు మోడీకి కూడా చెక్ పెట్టేంత పని చేసారు. ఇదో హెచ్చరికగా మోడీ గుర్తించాలి. తాము కోరుకున్న 400 సీట్ల లక్ష్యం సాధించడం లో వెనుక బడడమే గాక, విపక్షాల నుంచి గట్టి పోటీని ఎదుర్కోవలసి వచ్చింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ప్రజల ఆకాంక్షలను పట్టించుకోని ఏ పార్టీ అయినా మట్టి కరవక మానదు. తాత్కాలిక ఉద్రేకాలతో ప్రజలు ఎల్లకాలం దీవించరు. దేశం కావచ్చు, రాష్ట్రం కావచ్చు ప్రజాస్వామ్య బద్దంగా పాలన సాగాలి.

# పదకొండేళ్లలో ఆర్థిక పతనం



న్యూఢిల్లీ,ప్రధాని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయింది. ఆయన పాలన ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాల చుట్టూ కొనసాగుతూ ఉంది. రక్షణ, రైల్వేలతో సహా అనేక రంగాల్లో ఎక్కువ విదేశీ పెట్టుబడులను అనుమతించడానికి మోడీ ప్రభుత్వం భారతదేశ విదేశీ పెట్టుబడి విధానాలను సరళీకరించింది. దేశ, విదేశీ బడా పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా దేశఆర్థిక విధానాలు అమలు చేస్తున్నది. ఫలితంగా దేశంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, ఉపాధి సమస్య తీవ్రంగా ఉంది. భారతదేశాన్ని ప్రపంచ తయారీ కేంద్రంగా మార్చేందుకంటూ దేశ, విదేశీ కంపెనీలు దేశంలో ఉత్పత్తులు తయారు చేయటాన్ని ప్రోత్సహించడానికి 2014 సెప్టెంబర్‌లో మోడీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా' ప్రవేశ పెట్టింది. దీని ద్వారా విదేశీ కార్పొరేట్ సంస్థలు భారత మార్కెట్‌లో ఎక్కువ వాటాను స్వాధీనం చేసుకోవటానికి వీలు కల్పించింది.'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం తయారీ రంగం వృద్ధి రేటుని సంవత్సరానికి 12.14% పెంచటం, 2022 నాటికి జిడిపికి తయారీ రంగం వాటాను 25% పెంచటం. (తర్వాత దీన్ని 2025కి సవరించారు) 2022 నాటికి ఆర్థిక వ్యవస్థలో 100 మిలియన్ల అదనపు తయారీ ఉద్యోగాలు సృష్టించటం. వీటిని సాధించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2022 నాటికి జిడిపి తయారీ రంగం వాటా 25 శాతానికి చేరుకుంటుందని అంచనా వేయగా, 2013-14లో 16.7% ఉండగా, 2023-24 నాటికి 15.9 శాతానికి జిడిపి పడిపోయింది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించకపోగా, ప్రభుత్వ రంగ సంస్థల్లోని లక్షలాది ఉద్యోగాలు తొలగించారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందినట్లు మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. ఆర్థిక వ్యత్యాసాల్లోనూ, అప్పులు చేయడంలోనూ, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడంలోనూ, పేదరికంలోనూ, ఉద్యోగాలు కల్పించకపోవటంలోను మోడీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి మాత్రం వాస్తవం.నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు జరుపుతున్న ఆర్థిక విధానాలు కేవలం శత కోటీశ్వర్లకు మేలు చేయగా, పేదలకు తీవ్ర సమస్యలు సృష్టించింది. 2015లో భారత్ లో శత కోటీశ్వర్లు 97 మంది ఉండగా, ప్రస్తుతం వారి సంఖ్య 210 కి చేరింది. దీన్ని గమనిస్తే దేశ సంపద పేదల దరి చేరలేదనేది సుస్పష్టం. ఒక శాతం భారత జనాభా వద్ద 40 శాతం సంపద ఉంటే, 50 శాతం ఉన్న పేద వర్గాల వద్ద కేవలం 3 శాతం సంపద ఉంది. మోడీ ఆర్థిక విధానాలు పేదలను పేదలుగానే ఉంచింది. 2011 నుంచి ప్రభుత్వం పేదరికం, ఉపాధిపై అధికార డేటా ప్రకటించక పోవటంతో భారత ఆర్థిక పరిస్థితులను అంచనా వేయటం సాధ్యం కావటం లేదు. భారత ప్రభుత్వ గణాంక సంస్థ పేదరికం, ఉపాధిపై నిర్వహించే సర్వేలు నమ్మదగినవి కావని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.2014లో మోడీ అధికారంలోకి వచ్చే నాటికి దేశానికి రూ. 84 లక్షల కోట్ల అప్పు ఉంది. ఇందులో స్వదేశీ అప్పు రూ. 47.34 లక్షల కోట్లు కాగా, విదేశీ అప్పులు రూ. 37.4 లక్షల కోట్లు కాగా, 2025 నాటికి దేశం రూ. 224 లక్షల కోట్ల అప్పులకు చేరింది. ఇందులో స్వదేశీ అప్పులు రూ. 166.57 లక్షల కోట్లు కాగా, విదేశీ అప్పులు 57.4 లక్షల కోట్ల రూపాయలుగా ఉంది. మోడీ అధికారం చేపట్టిన తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో మన రూపాయి విలువ బాగా దిగజారింది. మోడీ అధికారంలోకి వచ్చే నాటికి అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్‌కు రూపాయి విలువ 60 రూపాయలుగా ఉంటే, మోడీ పాలనలో ఇప్పుడు 86 రూపాయలుగా ఉంది. తాజా లెక్కల ప్రకారం ఆహార సూచికలో ప్రపంచంలోని 127 దేశాల్లో భారత దేశం 105 స్థానంలో ఉంది. మోడీ అధికారంలోకి వచ్చిన 10 సంవత్సరాల కాలంలో దేశ ఆకలి సూచిక స్కోరు 28.8 నుంచి 27.38కి మారింది.దే కాలంలో పాకిస్తాన్‌లో స్కోర్ 29.8 నుండి 27.98 తగ్గింది. దేశ తలసరి ఆదాయంలో భారత్ 136వ స్థానంలో ఉండగా, అతిపేద దేశం శ్రీలంక 133వ స్థానంలో ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం భారత ఆర్థిక వ్యవస్థ 2024లో 6.5%తో అభివృద్ధి చెందుతుందని అంచనా వేయబడింది. ఇది మరే ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థల కన్నా ఎక్కువగా ప్రచారం చేయబడుతున్నది. అది వాస్తవం కాదు. 1987లో చైనా భారత ఆర్థిక ఆదాయం 0.27 ట్రిలియన్ల డాలర్లతో సమానంగా ఉన్నాయి. 2025 నాటికి భారత జిడిపి 4.19 ట్రిలియన్ డాలర్లు కాగా, చైనా జిడిపి 19.23 ట్రిలియన్ డాలర్లు. అంటే భారత్ కన్నా నాలుగు రెట్లు పైగా ఎక్కువ. ప్రస్తుతం చైనా తలసరి ఆదాయం 13,687 డాలర్లు కాగా, భారత తలసరి ఆదాయం 2,880 డాలర్లు మాత్రమే. పేదలకు ఈ ఆదాయం కూడా లేదు. దీన్ని గమనిస్తే భారత ఆర్థిక వ్యవస్థ పెరుగుదల వాస్తవ రూపంలో లేదని అర్థమవుతుంది.11 సంవత్సరాల మోడీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను పెద్ద ఎత్తున అమ్మకాలకు పెట్టారు. దీన్ని సమర్థించుకోవటానికి, ప్రభుత్వం వ్యాపారం చేయదని అది ప్రభుత్వ విధానం కాదని, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను అమ్మి ఆ డబ్బులను ప్రజాసంక్షేమానికి ఉపయోగిస్తామని చెప్పటంలో వంచన దాగి ఉంది. ప్రధాని మోడీ ఒక విషయాన్ని మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ సంస్థలు, ఆస్తులు ప్రజా సంక్షేమం కోసం ఉన్నవే గాని లాభాల కోసం ఏర్పాటు చేసినవి కాదు. ప్రజా సంక్షేమం పట్టని మోడీ ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలను, ఆస్తులను బడా పెట్టుబడిదారులకు కారుచవకగా అమ్ముతున్నది. తొలి ఐదు సంవత్సరాల పాలనలో ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, ప్రభుత్వ సంస్థల్లో వాటాల విక్రయం ద్వారా 3 లక్షల కోట్ల రూపాయలను మోడీ ప్రభుత్వం పొందింది.మలి విడత పాలనలో 1.5 లక్షల కోట్లను పొందింది. ఈ విధంగా ప్రభుత్వ రంగ సంస్థలను, ఆస్తులను ప్రైవేట్ సంస్థల పరం చేస్తున్నది. మొండి పారు బకాయిల పేరుతో బడా పారిశ్రామిక వేత్తలు బ్యాంకులకు చెల్లించాల్సిన దాదాపు రూ. 14 లక్షల కోట్ల అప్పులను రద్దు చేయడం మోడీ ప్రభుత్వ విధానాలకు అద్దం పడుతున్నది. మోడీ ప్రభుత్వ విధానాల ఫలితంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉంది. దేశంలో పని చేసే జనాభాలో 60% దాక వ్యవసాయ రంగం మీద ఆధా రపడి జీవిస్తున్నారు. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ అందుకు విరుద్ధంగా రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపుతున్నారు. పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించటానికి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు. మూడు వ్యవసాయ చట్టాల ద్వారా పంటల కొనుగోళ్ల నుంచి తప్పుకున్నట్లు ప్రకటించింది.

# రైతులకు అండగా ప్రభుత్వం

హైదరాబాద్,తెలంణ వ్యవసాయం గాడిన పడుతోంది. అన్నదాతకు అన్ని విధాలుగా అండ దొరికిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ముందుకు నడిపించేదిగా ఉంటోంది. తెలంగాణ దేశానికి రైస్‌బౌల్‌గా మారిందని ఇటీవలే మంత్రి తుమ్మల ప్రకటించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఇంకా రైతులు ఆందోళన చేస్తూనే ఉన్నారు. మృగశిర ప్రవేశించి మళ్లీ నాట్లు పడుతున్న వేళ ఇంకా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. అయితే రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు జరిగినా ఇంకా ధాన్యం వస్తూనే ఉంది. ఇదంతా కూడా పెరిగిన ధాన్యం దిగబడులకు నిదర్శనంగా చూడాలి. వ్యవసాయాభివృద్దిలో తెలంగాణ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నది. ఇటీవల వరి సదస్సులో మంత్రి చేసిన ప్రకటన ఇందుకు నిదర్శనంగా చూడాలి. ఉచిత విద్యుత్ వంటి చర్యలు ధాన్యం దిగుబడులకు నిదర్శనంగా చూడాలి. అయితే ధాన్యం చేతికొచ్చే సమయంలో కొనుగోళ్లలో గట్టి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. సిఎం రేవంత్ రెడ్డికి రైతుల పట్ల ఉన్న ప్రేమ, వ్యవసాయం పట్ల ఉన్న అవగాహన వల్ల తెలంగాణ రైతాంగానికి మంచిరోజులు రానున్నాయి. అప్పుడే తెలంగాణ వ్యవసాయ విధానం దేశానికి ఆదర్శంగా మారుతుంది. ఇప్పటికే రైతులకోసం పలు కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం రైతు పండించిన పంటకు మద్దతు ధర దక్కేందుకు వీలుగా వ్యవసాయ విధానాన్ని రూపొందించి ముందుకు సాగాలి. వ్యవసాయంలో లాభాలు రావాలంటే ప్రధానంగా కరెంట్, నీళ్ళు, రైతుకు దన్నుగా నిలువడం, వారిలో మేమున్నామనే ధైర్యాన్ని వ్వడం అవసరం. ఇటీవల ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని కొన్ని చోట్ల ఆందోళనలు కూడా జరిగాయి. దేశానికే అన్నం పెట్టే స్థితికి తెలంగాణ చేరిందన్న ప్రచారం కన్నా..రైతులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారన్న పరిస్థితి రావాలి. పండించిన పంటలకు ప్రభుత్వమే జవాబుదారీగా ఉంటే మరీ మంచిది. అందరూ ఒకే పంట వేయడంతో డిమాండ్ లేక పంటకు సరైన ధర రాదు. రైతు తన భూమిలో వివిధ రకాల పంటలు వేసినట్లయితే డిమాండ్ పెరిగి ధరకూడా ఎక్కువ వస్తుందని ప్రభుత్వం వాదిస్తోంది. పంటమార్పిడి నియంత్రిత పద్ధతిలో పంటలు సాగుచేసేందుకు పటిష్ఠ ప్రణాళిక రూపొందించాలి. రైతుకు అండగా రాష్ట్రస్థాయి వరకు అనేక రకాలుగా రైతులకు భరోసా ఇచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలి.

# చంద్రాబుతో టాలీవుడ్ ప్రముఖుల భేటీ

అమరావతి,టాలీవుడ్‌లో ఆసక్తిపరిణామాలు చోటు చేసుకోబోతున్నాయి. ఆంధ్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొచ్చింది. ఈ కాలంలో టాలీవుడ్ ప్రముఖులు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలవకపోవడం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. తన అసహనాన్ని బహిర్గతం చేశారు. పవన్ చేసిన వ్యాఖ్యలపై టాలీవుడ్ ప్రముఖులు స్పందించారు. ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, దిల్ రాజు వంటి వారు పవన్ సూచనలను సానుకూలంగా తీసుకున్నారు. దిల్ రాజు అయితే, 'పవన్ గారు నాకు అన్నలాంటివారు. ఆయన చెప్పినదాన్ని పరిశీలించకుండా ఉండలేం' అని పేర్కొన్నారు. దీంతో టాలీవుడ్ ప్రముఖులు కలిసి ఏపీ సీఎం చంద్రబాబును కలవాలన్న నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 15వ తేదీన ఉండవల్లిలో చంద్రబాబును కలిసేందుకు అప్పాయింట్ మెంట్ కోరారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు అప్పాయింట్ మెంట్ కోరినట్టు- సమాచారం. దాదాపు 30 మంది వరకు సినీ రంగ ప్రముఖులు ఏపీ సీఎంను కలవనున్నట్లు- తెలుస్తోంది. అల్లు అరవింద్, దిల్ రాజు పరిశ్రమ నుంచి పెద్దలుగా తమ సమస్యలను చంద్రబాబుకు వివరించనున్నారు. చంద్రబాబును కలిసే పక్రియకు పవన్ కళ్యాణ్ సారథ్యం వహించనున్నట్లు- సమాచారం. ఈ భేటీలో ప్రధానంగా సినిమా నిర్మాణం, ప్రదర్శనకు సంబంధించిన విధానాలు, పన్నుల అంశాలు, బెనిఫిట్ షోలు, టికెట్ ధరల నియంత్రణ వంటి కీలక అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, పవన్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదల సందర్భంగా థియేటర్లపై తీసుకున్న కొన్ని నిర్ణయాలు పవన్ కళ్యాణ్‌కి నచ్చకపోవడంతో, సినీ రంగంపై నేరుగా వ్యాఖ్యలు చేశారు. అయితే ఆ సమయంలో అల్లు అరవింద్, దిల్ రాజు వంటి నిర్మాతలు స్పందిస్తూ పవన్ కళ్యాణ్ సినిమాని ఆపే దమ్ము ఎవరికి ఉందని కామెంట్ చేశారు. ఏది ఏమైన ఇప్పుడు టాలీవుడ్ ప్రముఖులు చంద్రబాబుతో భేటి కానుండడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# పబ్‌లో హంగామా..నటి కల్పికపై కేసు నమోదు

హైదరాబాద్, ప్రిజం పబ్ లో నానా హంగామా చేసిన నటి కల్పిక పైన పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 29న, రాత్రి సమయంలో పబ్‌కి వెళ్లిన కల్పిక అక్కడి సిబ్బందిపై అసభ్యంగా ప్రవర్తించింది. అర్ధరాత్రి సమయంలో పబ్బులో తనకు కాంప్లిమెంటరీ కావాలని హంగామా చేయడంతో, అక్కడికి పోలీసులు వచ్చారు. పోలీసుల పైన కూడా కల్పిక దురుసుగా వ్యవహరించారు. అంతేకాకుండా పబ్బులో ప్లేట్లు గ్లాసులుతో పాటు ఫర్నిచర్‌ని కూడా కల్పిక ధ్వంసం చేసింది. ఈ నేపథ్యంలో, ప్రిజం పబ్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసును విచారించిన అనంతరం కోర్టు అనుమతి తో పోలీసులు నటి కల్పికపై కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఇంకా విచారణ కొనసాగుతోంది. సినీ రంగంలో గుర్తింపు తెచ్చుకున్న కల్పికపై ఇటువంటి ఆరోపణలు రావడంతో సినీ వర్గాల్లో కలకలం రేగింది.

# పదవులు వచ్చేదెప్పుడు?

అమరావతి,ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కావస్తుంది. వైసీపీ అధికారం కోల్పోవడంతో అనేక మంది నేతలు పార్టీకి రాజీనామా చేశారు. అధికార పార్టీలోకి చేరిపోయేందుకు సిద్ధమవుతున్నారు. అందులో ప్రధానంగా ఎమ్మెల్సీలు చాలా మంది ఇప్పటికే వైసీపీతో పాటు ఎమ్మెల్సీ పదవికి కూడా రాజీనామా చేశారు. అయితే వారు గత కొంత కాలం నుంచి రాజీనామాలు ఆమోదించాలంటూ శాసనమండలి ఛైర్మన్ కు మొరపెట్టుకుంటున్నారు. అయితే ఇంత వరకూ రాజీనామాలు ఆమోదం పొందలేదు. మరొక వైపు రాజీనామా చేసిన ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరేందుకు కూడా దారి రెడీ కాలేదు. రాజీనామా చేసిన వారిలో కొందరిని ఇంకా పార్టీలో చేర్చుకోలేదు.

పార్టీలో చేర్చుకోవడానికి...

పోతుల సునీత ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. అయితే ఆమె రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ ఆమోదించలేదు. అదే సమయంలో పోతుల సునీతను టీడీపీలో కూడా చేర్చుకోలేదు. పోతుల సునీతను పార్టీలోకి చేర్చుకోవద్దంటూ సొంత పార్టీ నేతల నుంచే అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నాడు అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు, లోకేశ్ పై విమర్శలు చేసిన పోతుల సునీతను పార్టీలోకి ఎలా చేర్చుకుంటారని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూటిగానే ప్రశ్నించారు. కేవలం శిరీష మాత్రమే కాదు టీడీపీ నేతలు, కార్యకర్తల నుంచి కూడా పెద్దయెత్తున విమర్శలు సోషల్ మీడియాలో కనపడటంతో ఆమెను పార్టీలోకి తీసుకోలేదు.

# పరిశ్రమలలో ప్రమాదాలు పట్టదా?



విశాఖ:ఉమ్మడి విశాఖ జిల్లాలో వరసబెట్టి పలు పరిశ్రమలలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాలలో మరణాలు సైతం సంభవిస్తున్నాయి. ప్రమాదాలు జరిగినపుడు అయ్యో అనడం ఆనక ఊరుకోవడమే పాలకులకు అలవాటు అయిపోయింది అని విమర్శలు చేస్తున్నారు.పరిశ్రమలలో భద్రతా ప్రమాణాలు పాటించే విషయంలో నిరంతర తనిఖీలు నిఘా ఉండదా అని ప్రశ్నిస్తున్నారు. తాజాగా విశాఖ జిల్లా పరవాడ వద్ద ఒక ఫార్మా కర్మాగారలో ప్రమాదం జరిగి ఇద్దరు మరణించారు. గతంలో కూడా ఇలాగే జరిగింది.ఫార్మా కర్మాగారాలలో సరైన భద్రత పాటించకపోవడం వల్ల కార్మికులు బలి అవుతున్నారని అంటున్నారు. దీని మీద వైసీపీకి చెందిన మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. విశాఖ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రమాధాలు ఎక్కువయ్యాయని ఆయన అన్నారు. అలా చూస్తే కనుక ఏసెన్షియా ఫార్మా కంపెనీ సహా మిగతా ప్రమాదాలలో చాలా మంది మరణించారని గుర్తు చేశారు. అయితే కంపెనీలు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాయా లేదా ప్రభుత్వం గమనించాలని కోరారు.ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ఆయన కోరారు. ప్రమాదకర విష వాయువులు ఉండే కంపెనీలలో జాగ్రత్తలు తీసుకుంటున్నారో లేదో ప్రభుత్వం చూడాలని అన్నారు. మృతుల కుటుంబాలకు కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం అండగా ఉండాలని డిమాండ్ చేశారు.ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని ఆయన అన్నారు. కేవలం ఒక ఏడాదిలోనే అనేక ప్రమాదాలు పరిశ్రమల్లో జరిగాయని గుర్తు చేశారు. గతంలో ఇన్ని ప్రమాదాలు ఎప్పుడూ జరగలేదని ఆయన చెప్పారు. అంతే కాదు గతంలో జరిగిన ప్రమాదంలో ఎలా నష్ట పరిహారం ఇచ్చారో అలాగే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# దేశంలో జరిగిన ఎయిర్ ప్రమాదాలలో మరణించిన ప్రముఖులు వీరే

హైదరాబాద్ : భారతదేశంలో జరిగిన విమానాల ప్రమాదంలో ప్రధానంగా పలువురు ప్రముఖ సెలబ్రిటీలు చనిపోయారు .. విమానాలు మాత్రమే కాదు హెలికాప్టర్ ప్రమాదంలోనూ ఇలా చనిపోయిన వారు ఉన్నారు ..ప్రధానంగా మన తెలుగు రాష్ట్రాలకు చెందిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉండగానే హెలిక్యాప్టర్ క్రష్ అయి మరణించారు .. అలాగే అంతకుముందు లోక్సభ స్పీకర్ గా పనిచేసిన జి.ఎం.సి బాలయోగి కూడా హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు ..ఈ విమాన ప్రమాదాల్లో అత్యంత ప్రముఖులు ఈ లోకాన్ని విడిచి వెళ్లిపోయారు .. భారత్ అనుశాస్త్రవేత్త ప్రపంచ ప్రసిద్ధి చెందిన హెూమి జహంగీర్ బాబా ఎయిర్ ఇండియా విమానంలో ప్రయాణిస్తూ ఆ విమాన ప్రమాదంలో మరణించారు .. అయితే ఇది 1966 లో జరిగింది .. ఈ ప్రమాదంలో మొత్తం 116 మంది మరణించారు హెూమీ బాబా మరణం భారత్ అణు కార్యక్రమానికి ఎంతో తీరని లోటుగా మిగిలింది.అలాగే 1973లో జరిగిన ఇండియన్ ఎయిర్లైన్స్ ప్రమాదంలో భారతీయ ధనవంతుల్లో ఒకరైన కుమార మంగళం బిర్లా చనిపోయారు .. అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో స్టీల్ మంత్రిగా ఈయన పని చేశారు .. అలాగే 1980లో ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్ గాంధీ విమాన ప్రమాదంలో చనిపోయారు ..అలాగే 1994 లో పంజాబ్గవర్నర్ అలాగే హిమాచల్ యాక్టింగ్ గవర్నర్ గా ఉన్న సురేందర్ నాథ్ తన కుటుంబంలోని తొమ్మిది మంది సభ్యులతో సహా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన సూపర్ కింగ్ విమానంలో ప్రయాణిస్తూ హిమాచల్ ప్రదేశ్ లోని పర్వతాల్లో కూలిపోవడంతో అక్కడికక్కడే మరణించారు.అదేవిధంగా కాంగ్రెస్ నాయకుడు మాజీ కేంద్రమంత్రి మాధవరావు సింధియా , , కాన్పూర్కు వెళుతున్న సమయంలో విమానం యూపీలో కూలిపోయి అక్కడికక్కడే మరణించారు . అలాగే తెలుగుదేశం పార్టీ నాయకుడు లోక్సభ స్పీకర్ బాలయోగి హెలికాప్టర్ ప్రమాదంలో మరణించారు . లోక్సభ స్పీకర్గా అతని మరణం జాతీయ రాజకీయాల్లో తీవ్రమైన నష్టంగా మిగిల్చింది



..అలాగే సౌత్ స్టార్ హీరోయిన్ భారతీయ జనతా పార్టీ నాయకురాలు సౌందర్య ఓ ఎన్నికల ప్రచారంలో భాగంగా బెంగళూరు నుంచి కరీంనగర్కు వెళుతున్న సమయంలో హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు ..హర్యానా పవర్ మంత్రి , ప్రముఖ పారిశ్రామికవేత్త ఓ.పి. జిందాల్ , హర్యానా వ్యవసాయ శాఖ మంత్రి సురేందర్ సింగ్ తో కలిసి ఢిల్లీ నుంచి చండీగఢ్కు హెలికాప్టర్లో వెళుతున్న సమయంలో సాంకేతిక సమస్య కారణంగా హెలికాప్టర్ కూలిపోవడంతో మరణించారు .ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్తూరు జిల్లాకు హెలికాప్టర్లో నల్లమల అడవులు వైపు వెళుతున్న సమయంలో అనుకోకుండా కూలిపోవడంతో మరణించారు .అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి డోర్జీ ఖండూ, పవన్ హన్స్ హెలికాప్టర్లో ప్రయాణిస్తుండగా, గ్రౌండ్ కంట్రోల్తో సంబంధం కోల్పోయిన తర్వాత కూలిపోయింది. ఐదు రోజుల తర్వాత శిథిలాలు కనిపెట్టారు.భారతదేశం మొదటి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, తన భార్య మధులికా రావత్తో సహా 12 మందితో కలిసి, ఇండియన్ ఎయిర్ ఫోర్స్ మి-17V5 హెలికాప్టర్ లో వెళ్తూ ప్రమాదానికి గురయ్యారు.ఇప్పుడు తాజాగా అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదంలోవిజయ్ రూపానీ చనిపోయారు . ఈయన గుజరాత్ కు 2016 నుంచి 21 వరకు విజయ్ రూపానీ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

# కేసీఆర్-కవితల మధ్య ఎంతెంత దూరం...?

హైదరాబాద్,చిన్నప్పుడు "ఎంతెంత దూరం.. చాలా చాలా దూరం!" అంటూ రైలాట ఆడుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు సేమ్ టు సేమ్ బీఆర్ ఎస్లోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. కేసీఆర్ను దేవుడు అంటూ.. ఆయన చుట్టూ దయ్యాలున్నాయని వ్యాఖ్యానించిన బీఆర్ ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కవిత వ్యవహారంపై ఆమె తండ్రి, బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్ కూడా.. చాలా చాలా దూరంగానే ఉంటున్నారు. తాజాగా ఆమె.. తండ్రిని కలుసుకునేం దుకువెళ్లినా.. ఆయన కనీసం పలకరించలేదని వార్తలు వచ్చాయి.గతంలో కేసీఆర్ ఎక్కడికి బయలు దేరినా.. తన కుమార్తెతో భుజానికి పార్టీ గుర్తును కట్టించుకునేవారు లేదా .. నుదిటన బొట్టు పెట్టించుకునేవారు. కానీ, తాజాగా కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరయ్యేం దుకు బయలు దేరే సమయంలో కవితను ఆయన కనీసం పట్టించుకోలేదు. అంతేకాదు.. కనీసం పన్నెత్తి కూడా పలకరించలేదు. దీంతో కేసీఆర్.. కవితకు .. మధ్య ఎంతెంత దూరం పెరుగుతోందంటే.. చాలా చాలా దూరమే పెరుగుతోందని పరిశీలకులు చెబుతున్నారు.కేసీఆర్ చాటు బిడ్డగా రాజకీయాల్లోకి వచ్చినా.. ఆయన దన్నుతోనే రాజకీయంగా కవిత ఎదిగారు. కానీ, ఇటీవల ఆధిపత్య ధోరణి ప్రదర్శించారు. ఈ క్రమంలోనే బీఆర్ ఎస్ కండువాను కూడా పక్కన పెట్టారు. సహ జంగా కేసీఆర్ తనను ఏమన్నా.. కొంత మేరకు సహిస్తారు కానీ.. పార్టీ కండువాను తృణీకరిస్తే.. మాత్రం ఆయన అస్సులు సహించరు. బహుశ .. కవిత విషయంలోనూ ఇదే జరిగి ఉంటుందన్న భావన వ్యక్తమవు తోంది. కవిత 'డియర్



డాడీ' లేఖ తర్వాత.. నిర్వహించిన ప్రెస్ మీట్లు వివాదమయ్యాయి.ఆ తర్వాత. బయటకు వచ్చినప్పుడు కూడా.. బీఆర్ ఎస్ కండువా కప్పుకోలేదు. ఈ పరిణామాలకు తోడు దెయ్యాలంటూ వ్యాఖ్యానించడం కూడా కేసీఆర్ను తీవ్రంగా కుదిపేసింది. కేసీఆర్ నాయకత్వాన్ని ఆమె నేరుగా ప్రశ్నించకపోయినా.. అంతే చేశారన్న గుసగుస కూడా వినిపిస్తోంది. ఆడబిడ్డకు అన్యాయం చేస్తారా? అంటూ.. ప్రశ్నలు కూడా గుప్పించారు. వెరసి ఇవన్నీ.. కేసీఆర్ మదిలో తిరుగుతూనే ఉన్నాయి. అందుకే.. ఏరికోరి కుమార్తె ఇంటికి వచ్చినా..ఆయన కనీసం పలకరించకుండానే వెళ్లిపోయారని పార్టీలో చర్చ నడుస్తోంది.

# కెసిఆర్,కిషన్ రెడ్డి ఎప్పటికీ ఒక్కటి కాదు



హైదరాబాద్, గల్లీలో గలీజ్ దందాలు చేస్తూ ఢిల్లీలో గులాం గురి చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తీరు ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణ భవన్లో వేముల ప్రశాంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో చిట్ చాట్ చేశారు. మంత్రుల శాఖల కేటాయింపు కోసం, కాంగ్రెస్ పార్టీ అధినేతల అపాయింట్మెంట్ కోసం రెండు రోజులు ఢిల్లీలో పడిగాపులు కాసి అపాయింట్మెంట్ దొరకని ఫ్రస్టేషన్లో మాట్లాడుతున్నాడు. కేసీఆర్, కిషన్ రెడ్డి ఒక్కటే అని రేవంత్ రెడ్డి అన్న మాట అబద్ధం, అవాస్తవం. రేవంత్ రెడ్డి బీజేపీ ఒక్కటి అన్నది వాస్తవం. రేవంత్ రెడ్డి ,బీజేపీ దోస్తాన్ చాలా సార్లు బయట పడింది. లోక్సభ ఎన్నికల్లో బలహీన అభ్యర్థులను పెట్టి బీజేపీ ఎంపీలు గెలవడానికి రేవంత్ రెడ్డి సహాయ పడ్డారు. స్వయంగా ఈ మాట బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మల్కాజ్గిరిలో ఈటల రాజేందర్ను గెలిపించడానికి వేరే ప్రాంతం నుంచి సునీతా మహేందర్ రెడ్డిని నిలబెట్టారు. కిషన్ రెడ్డిని గెలిపించడానికి బీఆర్ఎస్లో ఉన్న దానం నాగేందర్ని సికింద్రాబాద్లో నిలబెట్టారు. కాంగ్రెస్ నుండి గతంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా పలుమార్లు పోటీ- చేసిన అనుభవం ఉన్న జీవన్ రెడ్డికి కాదని ప్రత్యక్ష రాజకీయాలతో సంబంధం లేని వెలిచాల రాజేందర్కు కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్పై పోటీకి నిలిపారు. ఇలా నిజమాబాద్లో అరవింద్పై, మెదక్లో రఘునందన్పై, ఆదిలాబాద్లో నగేశ్లపై రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బలహీన అభ్యర్థులను నిలబెట్టారు. 8 మంది బీజేపీ ఎంపీలలో 7 మందిని రేవంత్ రెడ్డినే గెలిపించారు. బీజేపీ పార్టీ కూడా రేవంత్ రెడ్డిపై ఈగ వాలనివ్వడం లేదు అని వేముల ప్రశాంత్ రెడ్డి గుర్తు చేశారు.స్వయంగా ప్రధాని మంత్రి మోదీ ఎలక్షన్ ప్రచారంలో తెలంగాణలో ఆర్ ఆర్ ట్యాక్స్ నడుస్తుంది అని మాట్లాడిన ఈడి, సీబీఐ ఎందుకు రావడం లేదు..? ఓటుకు నోటు కేసు ఎటుపోయింది, ఎందుకు జాప్యం జరుగుతోంది..? రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయినప్పుడు రాహుల్ గాంధీ అపాయింట్మెంట్ దొరకదు కానీ ప్రధానిని కలవడానికి 15 నిమిషాల్లో అపాయింట్మెంట్ ఎలా దొరుకుతుంది..? బండి సంజయ్ బహిరంగంగానే రేవంత్ రెడ్డి పదవి కాపాడుకోవాలని సూచనలు ఇస్తున్నాడు. బీఆర్ఎస్ను రాజకీయంగా బొంద పెట్టడానికి కాంగ్రెస్, బిజెపి కలిసి పని చేయాలి అని బండి సంజయ్ అన్నారు. బీజేపీ కాంగ్రెస్ ఒక్కటే అనే సంకేతం బండి సంజయ్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి బీజేపీలో జాయిన్ అయితే స్వాగతిస్తామని ఎంపీ అరవింద్ అంటు-న్నారు. ఇది రేవంత్ రెడ్డి, బీజేపీ దోస్తానకు సంకేతము కాదా..? నేను బీజేపీ స్కూల్లో చదువుకున్న అని రేవంత్ రెడ్డి ఢిల్లీలో అన్నారు. హైదరాబాద్లో అన్నది మోదీ విన్నాడో లేదో అని మళ్ళీ అవే మాటలు ఢిల్లీలో మాట్లాడిండు. బీజేపీలోకి వెళ్తాను అని సూచన ఇస్తున్నట్టు-న్నాడు. కాంగ్రెస్ పార్టీ వాళ్ళు రేవంత్ రెడ్డిని నమ్మకండి.. కాంగ్రెస్ పార్టీని ఖతం చేసి బీజేపీలోకి పోతారు అని ప్రశాంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ తెలంగాణకు ఆత్మ. తెలంగాణ కోసం కేసీఆర్ పోరాడుతున్న సందర్భంలో ఉద్యమకారులపైకి తుపాకీ ఎక్కు పెట్టిన రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు. ఏపీకి చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తుంటే నోరు ముసుకున్న రేవంత్ రెడ్డి తెలంగాణ శత్రువు. కేసీఆర్ హయాంలో తలసరి ఆదాయంలో దేశంలో మొదటి స్థానంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4వ ప్లేస్కు, జీడీపీలో 4వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని 13వ స్థానానికి దిగజార్చిన నువ్వు తెలంగాణ శత్రువు. తెలంగాణ అప్పుల పాలైందని, తెలంగాణ ముఖ్యమంత్రిగా వెళ్తే దొంగలా చూస్తున్నారని తెలంగాణ పరువు తీస్తున్న రేవంత్ రెడ్డి తెలంగాణకు శత్రువు అని ప్రశాంత్ రెడ్డి ధ్వజమెత్తారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణకి అన్యాయం చేస్తున్నారు. 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి తెలంగాణకు ఒక్క రూపాయి తీసుకురాలే. ఆంధప్రదేశ్లో ఉన్న టీ-డీపీ ఎంపీలు వేల కోట్లు- నిధులు తెచ్చుకున్నారు. నిధుల వరద ఆంధప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుపోతున్నారు. పోలవరం, అమరావతి రాజధాని, విశాఖ స్టీల్ ఎ÷-లాంట్కు వేల కోట్లు-, బనకచర్లకు జాతీయ హోదా తెస్తుంటే మన కాంగ్రెస్, బిజెపి ఎంపీలు ఒక్క రూపాయి కూడా తెలంగాణకు తేవట్లేదు. కాబట్టి తెలంగాణకి అసలైన శత్రువులు బీజేపీ కాంగ్రెస్ పార్టీలే..? బీఅరెస్ పార్టీకి, కేసీఆర్కు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం.. బీఆర్ఎస్ ఎంపీలు గెలిచి ఉంటే తెలంగాణకు ఈ గతి పట్టేదా. 45 సార్లు ఢిల్లీకి పోతే 4 సార్లు కూడా రాహుల్ గాంధీ అపాయింట్ మెంట్ దొరకలేదు. తెలంగాణ ముఖ్యమంత్రి బతుకు అలా ఉంది అని ప్రశాంత్ రెడ్డి విమర్శించారు.

# ఏడాదిలో రాజకీయ నిరుద్యోగం



అమరావతి,ఏపీలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంది. ఐదేళ్ల వైసీపీ పాలనపై అలుపులేని పోరాటం చేసిన మూడు పార్టీల కూటమి సరిగ్గా ఏడాది క్రితం బంపర్ విక్టరీ సాధించింది. ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలుగా అధికారం చలాయిస్తున్నారు. ఏడాదిగా రాజయోగంతో చాలా మంది హ్యాపీగా గడుపుతున్నారు. తమకు తిరుగులేదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అయితే ఈ ఏడాదిలో తమకేం చేశారో చెప్పాలంటూ కూటమి కార్యకర్తలు నిలదీస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలుగా గెలిపిస్తే తమకు ఏ పదవులిచ్చారని ప్రశ్నిస్తున్నారు.కూటమి పాలనలో ఎక్కువగా రాజకీయ నిరుద్యోగం కనిపిస్తోందని టాక్ వినిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఘన విజయం సాధిస్తే, తమకు కనీస గుర్తింపు దక్కడం లేదని కార్యకర్తల్లో ఎక్కువ వ్యతిరేకత ఉందని అంటున్నారు. దీనికి కారణం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయకపోవడమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీలో పలువురు సీనియర్లు కూడా పదవులు లేక ఖాళీగా గడపాల్సిరావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు.తన నాలుగో విడత పాలన గతానికి భిన్నంగా ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పలుమార్లు ప్రకటించినప్పటికీ, ఈ సారి కూడా పదవుల భర్తీలో నాన్చుడు ధోరణే అనుసరిస్తున్నారని సొంత పార్టీ నుంచే విమర్శలు ఎదుర్కొంటున్నారు. గత ఏడాది జూన్ లో అధికారం చేపట్టిన తర్వాత రకరకాల కారణాలతో పదవుల భర్తీని వాయిదా వేసుకుంటూ వచ్చారు. తొలిసారి సెప్టెంబరులో 20 మందితో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేశారు. ఆ తర్వాత విడతల వారిగా దాదాపు 100 వరకు కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించారు. ఈ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా నియోజకవర్గ స్థాయి నేతలను నియమించారు.అయితే ఇంకా కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించడంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని టీడీపీ కేడర్ అసమ్మతితో రగిలిపోతోందని అంటున్నారు. అదేవిధంగా గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కూడా 80 శాతం పదవులను పెండింగులో పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. అధికారం వచ్చి ఏడాది అయినా, క్షేత్ర స్థాయిలో పదవులు లేక ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగం కాలేకపోతున్నామని టీడీపీతోపాటు జనసేన, బీజేపీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలో దాదాపు 90 శాతం స్థానిక సంస్థలు అంటే జిల్లా, మండల పరిషత్, పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాలు వైసీపీ అధీనంలోనే ఉన్నాయి. దీంతో కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో ఇంకా వైసీపీ నేతలే కనిపిస్తున్నారని అసంతృప్తి చెందుతున్నారు. జిల్లా, మండలస్థాయి పదవులు భర్తీ చేస్తే ప్రభుత్వ కార్యక్రమాల్లో తాము కూడా భాగమవుతామని అంటున్నారు. దీంతో కూటమి పాలనలో రాజకీయ నిరుద్యోగం బాగా ఎక్కువైందని విమర్శలు వినిపిస్తున్నాయి.

# జిల్లా ఇన్ఛార్జ్ మంత్రుల్లో మార్పులు

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం జిల్లా ఇన్చార్జి మంత్రులను మారుస్తూ నిర్ణయం తీసుకున్నది. కేబినెట్లోకి కొత్తగా తీసుకున్న మంత్రులకు సైతం బాధ్యతలు అప్పగించింది. పాత మంత్రులకు కేటాయించిన జిల్లాలను మార్చింది. మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా గడ్డం వివేక్ వెంకటస్వామి బాధ్యతలు అప్పగించింది. నల్లగొండకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖమ్మం జిల్లాకు వాకిటి శ్రీహరి, ఆదిలాబాద్కు జూపల్లి కృష్ణారావు బాధ్యతలు అప్పగించింది. నిజామాబాద్ ఇన్చార్జిగా సీతక్క, కరీంనగర్కు తుమ్మల నాగేశ్వర రావు, మహబూబ్నగర్కు దామోదర్ రాజనర్సింహా, రంగారెడ్డి జిల్లాకు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, హైదరాబాద్ ఇన్చార్జిగా పొన్నం ప్రభాకర్, వరంగల్ జిల్లా ఇన్చార్జిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డికి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.

# పేర్ని నానికి ఎందుకంత భయం ?

అమరావతి,పేర్ని నాని భయపడుతున్నారు. ఫలానా కేసులో అరెస్టు చేస్తారు అని వార్తల్లో రాగానే ప్రెస్మీట్లు పెడుతున్నారు. కోర్టులకు వెళ్తున్నారు. పోలీసుల్ని బెదిరిస్తున్నారు. మంత్రి కొల్లు రవీంద్రను హెచ్చరిస్తున్నారు. కార్యకర్తల సమావేశాల పెట్టి.. మనకేం కాదు.. నన్నెవరూ ఏమీ చేయలేరు అంటున్నారు. ఆయన తీరుతో వైసీపీ నేతలు కూడా ఇంత భయపడుతున్నారేంటి అని గుసగుసలాడుకుంటున్నారు.బియ్యం కొట్టేసిన కేసులో తన భార్య అరెస్టు కాకుండా.. వారం పది రోజుల పాటు ఒక్కో ప్రాంతానికి దొరక్కుండా తిరిగినప్పుడే మానసికంగా చచ్చిపోయానని ఆయన పెద్ద పెద్ద డైలాగులు చెబుతున్నారు. మరి అలాంటప్పుడు ఆ తప్పు అంతా తనదే అని చెప్పుకుని పోలీసులకు లొంగి పోయి ఉండాల్సింది. తన భార్యను అరెస్టు చేయించడానికి చాలా ప్రయత్నిం చారని కానీ చంద్రబాబు ఒప్పుకోలేదని తెలిసిందని కూడా ఆయన చెప్పుకున్నారు. ఇప్పుడు నకిలీ పట్టాలు పంపిణీ చేసిన కేసులో అరెస్టు చేస్తారని తెలియగానే పోలీసులపై ఒత్తిడి తెచ్చేందుకు రెడీ తియిపోయారు.చాలా మంది వైసీపీ నేతలు అరెస్టు చేయాలనుకుంటే చేయండి అని సవాల్ చేస్తున్నారు. తర్వాత అరెస్టు చేస్తారనుకుంటే పరారవుతున్నారు. పిన్నెల్లి నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డి వరకూ అందరూ అంతే. పేర్ని నాని కూడా ఇవే సవాళ్లు చేస్తున్నారు కానీ.. కనిపించకుం డా పోతున్నారు. జగన్ రెడ్డి తాను చాలా కాలం జైల్లో ఉన్నానని ఆయన బయటకు వచ్చి సీఎం అయ్యానని..మీరెవరైనా జైలుకు వెళ్తే గర్వంగా ఫీలవ్వాలని



అంటున్నారు. కానీ పేర్ని నాని ఎందుకో భయపడుతున్నారు. తాను తప్పు చేయలేదని మాత్రం చెప్పడంలేదు. తనపై కేసులు పెడితే.. అరెస్టు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తున్నారు.కొల్లు రవీంద్ర 2014-19 మధ్య కూడా మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో పేర్ని నాని స్వేచ్ఛగా రాజకీయాలు చేసుకున్నారు. కానీ పేర్ని నాని మంత్రి అయిన తర్వాత ఉద్దేశపూర్వకంగా కొల్లు రవీంద్రను తప్పుడు హత్య కేసులో ఇరికించి జైలుకు పంపారు. దాదాపుగా నెలన్నర రోజులు జైల్లో ఉన్నారు. ఓ సౌమ్యుడిని.. పద్ధతిగా రాజకీయాలు చేసే

# కీలక ఖనిజాల ఉత్పత్తి రంగంలో సింగరేణి తొలి అడుగు !

భువనేశ్వర్:సింగరేణి సంస్థ కీలకమైన ఖనిజ రంగంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో, భువనేశ్వర్లోని ప్రముఖ పరిశోధనా సంస్థ అయిన CSIR (Council of Scientific and Industrial Research), దాని అనుబంధ సంస్థ అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్ అండ్ మెటీరియల్స్ టెక్నాలజీతో ఒక అవగాహన ఒప్పందం పై సంతకం చేసింది.ఒడిశా రాజధాని భువనేశ్వర్ లో నీతి ఆయోగ్ సభ్యులు, మాజీ డీఆర్డీఓ డైరెక్టర్ జనరల్, పద్మభూషణ్ వీకే సారస్వత్ సమక్షంలో జరిగిన ఒప్పంద సమావేశంలో సింగరేణి సంస్థ చైర్మన్, ఎండీ ఎన్. బలరామ్, సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ్ నారాయణ్, రెండు సంస్థల సీనియర్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనల మేరకు సింగరేణి తన వ్యాపార విస్తరణ ప్రయత్నాలలో భాగంగా కీలకమైన ఖనిజాల రంగంలోకి ప్రవేశించాలని నిర్ణయించిందని, ఈ సందర్భంలో ఈ ఒప్పందం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుందని ఎండీ ఎన్. బలరామ్ వివరించారు.సింగరేణి కంపెనీ గనులు, సింగరేణి ప్రాంతాలలో ఉన్న వివిధ రకాల కీలక ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం కోసం ఉమ్మడి భాగస్వామ్య పద్ధతిలో ఈ ఒప్పందంపై సంతకం చేసినట్లు ఆయన తెలిపారు.




ఉత్పత్తి సమయంలో పూర్తి పర్యావరణహిత సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని కూడా ఒప్పందంలో పొందుపరచడం జరిగిందన్నారు. అంతేకాక ఆస్ట్రేలియాతో కూడా కీలక ఖనిజాల ఉత్పత్తికి సంబంధించి అవగాహనకు వచ్చామని, దీనిలో కూడా ఐఎంఎంటి సేవలు వినియోగించే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశీయంగా కీలక ఖనిజాల ఉత్పత్తి రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో సింగరేణి సంస్థ కూడా తన వంతుగా కొన్ని బ్లాకులను చేపట్టడానికి సర్వసన్నద్ధమై ఉందని తెలియజేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com